సోమవారం
MONDAY
16-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 137

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):8
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





శబరిమల మెట్లపైకి నిమిషానికి 75 మందికే అనుమతి

పతనంతిట్ట: మండల-మకరవిళక్కు యాత్రా కాలంలో భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు, శబరిమలలోని 18 పవిత్ర మెట్లను ప్రతి నిమిషానికి 75 మంది యాత్రికులను మాత్రమే ఎక్కడానికి అనుమతించాలని మంత్రి కె. మురళీధరన్ అన్నారు. లేకపోతే, క్యూ ఎట్టుమానూర్ వరకు విస్తరించవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత యాత్ర ముగిసిన వెంటనే, ఫిబ్రవరిలో వచ్చే యాత్రా కాలానికి తరువాయి 2 వ పేజీలో...

సిగ్గూ శరం లేదా?



గాంధీ కుటుంబానికి బాడీగార్డులా సీఎం

పీసీసీ చీఫ్, మంత్రులు నౌకర్లలా పరుగులు.. కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ తీవ్ర ధ్వజం

తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం అనే ప్రాతిపదికన ఏర్పాటయిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ విషయాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు.

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల తాలూకు హుందాతనం, గౌరవం తెలియకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ నడుపుతున్న బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం నాడు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ తరువాయి 2 వ పేజీలో...



కొండగట్టులో వైభవంగా చందనోత్సవం ప్రారంభం

ఆరు దశాబ్దాల తర్వాత అంజన్న నిజరూప దర్శనం

40 రోజుల పాటు భక్తులకు అరుదైన దర్శన భాగ్యం

మల్యాల, నవంబర్ 15 (ఈవార్తలు): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆరు దశాబ్దాల తర్వాత స్వామి వారి నిజరూప దర్శనానికి శ్రీకారం చుట్టారు. చందనోత్సవంలో భాగంగా స్వామివారి విగ్రహంపై ఉన్న సింధూరాన్ని తొలగించే కార్యక్రమాన్ని ఆదివారం ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ఈ అరుదైన ఆధ్యాత్మిక ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. చందనోత్సవం ప్రారంభమైన సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కొండగట్టు అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు పొందారు. మరోవైపు ఉత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తరువాయి 2 వ పేజీలో...



30 వేల కోట్లివ్వండి రైతులను ఆదుకోండి

ప్రధాని మోదీతో రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ: తెలంగాణలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, నిధుల విషయంలో కేంద్రం చొరవ చూపాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు సీఎం రేవంత్ రెడ్డి. రాష్ట్రంలో ప్రాజెక్టుల పనుల పురోగతి, వాటికి అవసరమైన అనుమతులు, నిధుల వివరాలను ప్రధానికి సమగ్రంగా వివరించారు. ప్రధాని మోదీతో సుమారు గంట పాటు జరిగిన సమావేశంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లోగోను ఆవిష్కరించడంతోపాటు.. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, ఖేలోఇండియా గేమ్స్ కు తరువాయి 2 వ పేజీలో...



కొత్త పింఛన్లు 4.63 లక్షలు

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): రాష్ట్రంలోని పేదలు, మహిళలు, వివిధ రంగాల కార్మికులకు అండగా నిలుస్తూ తెలంగాణ ప్రభుత్వం 'చేయూత' పథకం కింద కొత్తగా 4,63,857 మందికి సామాజిక భద్రతా పెన్షన్లను మంజూరు చేసింది. చాలా కాలంగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులను గుర్తించి ప్రభుత్వం ఈ మేరకు తుది జాబితాను విడుదల చేసింది. ప్రభుత్వం ప్రకటించిన ఈ కొత్త పెన్షన్ల జాబితాలో ప్రధానంగా -2 వ పేజీలో...

2031 ప్రపంచ కప్ ఆతిథ్య హక్కులు భారత్‌కు



న్యూఢిల్లీ: 2031 వన్డే ప్రపంచ కప్ ఆతిథ్య హక్కులను భారత్ దక్కించుకుంది. ఈ మెగా టోర్నీకి బంగ్లాదేశ్ సహ ఆతిథ్య దేశంగా వ్యవహరించనుంది. అంతేకాకుండా 2029 ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ బాధ్యతలు కూడా భారత్‌కే దక్కాయి. ఇండోనేసియాలోని బాలిలో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశాల్లో 2035 వరకు జరగనున్న పురుషుల ప్రధాన క్రికెట్ టోర్నమెంట్ల -2 వ పేజీలో...





రాశి ఫలాలు

16.11.2026

మేషం: దైవ చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. చిన్ననాటి మిత్రులతో ఆనందంగా గడుపుతారు. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధువులతో విభేదాలు తొలగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల పరిస్థితులు ఉంటాయి.

వృషభం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. మిత్రులతో వివాదాలు కొంత మానసికంగా చికాకు పరుస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు కొంత నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో కష్టించినా ఫలితం కనిపించదు. దాయాదులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి.

మిథునం: చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాట పట్టింపులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు పనిచేయదు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: భూ క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఒక వ్యవహారంలో ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతుంది. నూతన వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

సింహం: వృత్తి వ్యాపారాలు మరింత మెరుగైన రీతిలో రాణిస్తాయి. ఉద్యోగస్తులకు నూతన అవకాశాలు లభిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. బంధువుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి.

కన్య: విద్యార్థుల శ్రమ ఫలిస్తుంది. చేపట్టిన పనులు వాయిదా పడతాయి. బంధువర్గంతో వివాదాలు చికాకు పరుస్తాయి. బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

తుల: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో కొన్ని ఇబ్బందులు తప్పవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కీలక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చిన్ననాటి మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. బందువర్గంతో వివాదాలు కొంత బాధిస్తాయి.

వృశ్చికం: ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. గృహ వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

ధనస్సు: ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా వేస్తారు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో చిన్నపాటి సమస్యలు తప్పవు. ఒక వ్యవహారంలో సన్నిహితులతో విభేదాలు కలుగుతాయి.

మకరం: వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుతాయి. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

కుంభం: కుటుంబ సభ్యులతో అకారణంగా మాట పట్టింపులు కలుగుతాయి. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణాలు చేయవలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు ఆశించిన విధంగా సాగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు.

మీనం: ప్రముఖుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. బంధువర్గం నుండి శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనుల్లో పురోగతి సాధిస్తారు. విందు వినోద కార్యక్రమాలకు హాజరవుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో మరింత అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది.

30 వేల కోట్లివ్వండి రైతులను ఆదుకోండి



మొదటి పేజీ తరువాయి

ఆహ్వానించడంతో పాటు తెలంగాణలో ఎల్ నినో కరువు పరిస్థితులు, రాష్ట్రానికి కేంద్రం ఆర్థిక సాయం. నీటి ప్రాజెక్టులకు అనుమతులపై సుదీర్ఘంగా ప్రధానితో చర్చించారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్, డిండి ప్రాజెక్టులపై గత, ప్రస్తుత ప్రభుత్వాలు కలిపి సుమారు రూ.50 వేల కోట్లు వెచ్చించాయి. సుప్రీంకోర్టు స్టే సహా పలు కారణాలతో ఏళ్ల తరబడి పనులు మందగించాయి. దరఖాస్తులు స్వీకరించి పర్యావరణ అంచనా చేపట్టవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కేంద్ర పర్యావరణ శాఖలో దరఖాస్తుల పరిశీలన నెలల తరబడి ఆలస్యమవుతోంది. ఈ మూడు ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రధానిని కోరాం. దేశవ్యాప్తంగా అనుమతుల జాప్యంతో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశామని ఉత్తమ్ చెప్పారు.

తుమ్మిడిహట్టిపై ప్రతిపాదన

తుమ్మిడిహట్టి వద్ద గతంలో 148 మీటర్లకు ఒప్పందం కుదిరింది. పూర్తిస్థాయి నీటిమట్టాన్ని 152 మీటర్లకు పెంచాల్సిన అవసరాన్ని పటాలు, గణాంకాలతో ప్రధానికి వివరించాం. ఈ విషయమై ప్రధానికి గతంలో రాసిన లేఖపై ఆయన కార్యాలయం సూచన మేరకు కేంద్ర జల సంఘం సమావేశం నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ముంబయి వెళ్లి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిశాను. మహారాష్ట్ర అంగీకారం సాధించేందుకు ప్రధాని చొరవ కోరాం. అదనపు ముంపునకు కేంద్రం లేదా మహారాష్ట్ర నిర్ణయించే మేర పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. సమ్మక్క-సారలమ్మ ఎన్ఓసీపై 17తేదీ ఛత్తీస్‌గఢ్ సీఎంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ కానున్నారు. సమ్మక్క-సారలమ్మ బ్యారేజీ నిర్మాణం పూర్తయిందని, హైడ్రాలజీ అనుమతి కూడా వచ్చిందని ఉత్తమ్ తెలిపారు. బ్యారేజీని పూర్తి సామర్థ్యంతో వినియోగించేందుకు ఛత్తీస్‌గఢ్ ఎన్ఓసీ జారీని వేగవంతం చేయాలని ప్రధానిని కోరినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్ కోరిన మేరకు ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ముంపు నివేదిక తెప్పించామన్నారు. అదనపు డీపీఆర్ కోసం కోరిన సొమ్ము జమ చేశామనీ ముంపునకు పరిహారం చెల్లించేందుకు సిద్ధమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇప్పటికే తెలిపామని వివరించారు. సమ్మక్క-సారలమ్మ డీపీఆర్‌ను సమర్పించిన తర్వాత సాంకేతిక సలహా కమిటీ అనుమతికి సంబంధించిన మార్గదర్శకాలు మారాయి. డీపీఆర్ సమర్పించినప్పుడు అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే దాన్ని పరిశీలించాలని కోరారు..రేపు కేంద్ర జల సంఘం చైర్మన్‌ను కలవనున్నారు అలాగే 2027-28 ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన కింద నాలుగు సాగునీటి పథకాలకు రూ.5,856 కోట్లు కోరామని ఉత్తమ్ వెల్లడించారు. సీతమ్మసాగర్-సీతారామ సమీకృత ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోడికుంట వాగుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరానికి రూ.178 కోట్లు, చనాకా-కొరాట బ్యారేజీకి రూ.103 కోట్ల కోసం కేంద్ర జలశక్తి శాఖకు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల ప్రత్యేక సాయం పథకం కింద కేంద్రం దేశవ్యాప్తంగా రూ.2 లక్షల కోట్ల మేర 50 ఏళ్ల వడ్డీలేని రుణాలను ప్రకటించింది. తెలంగాణకు ఇప్పటివరకు రూ.1,457 కోట్లు అందాయి. రాష్ట్రంలో 70 నుంచి 90 శాతం పూర్తయిన సాగునీటి ప్రాజెక్టుల తుది పనులకు అదనంగా రూ.5,000 కోట్లు మంజూరు చేసి విడుదల చేయాలని కోరాం. నిధులు అందితే 2027 మార్చి 31లోగా వినియోగించగలం. ఏడాదిలోగా కొత్త ఆయకట్టుకు నీరందించి, ప్రస్తుత ఆయకట్టును స్థిరీకరించగలమని మంత్రి అన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు ప్రత్యేక సాయం

ఎల్‌నినో నేపథ్యంలో వర్షాభావం, పలు జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న తీరును గణాంకాలతో ప్రధానికి వివరించామని ఉత్తమ్ తెలిపారు. కేంద్ర భూగర్భ జల మండలి 2026 సెప్టెంబర్ నివేదికతో పాటు అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూగర్భ జలాలను పెంచేందుకు, పరిరక్షించేందుకు రూపొందించిన స్వల్ప, దీర్ఘకాలిక కార్యాచరణను అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమానికి రూ.5,000 కోట్ల ప్రత్యేక కేంద్ర ఆర్థిక సాయం కోరినట్లు వెల్లడించారు.వచ్చే వానాకాలం వరకు తాగునీటి అవసరాలకు సరిపడా నీటిని రిజర్వాయర్లలో నిల్వ ఉంచాం. ఈ యాసంగిలో వరి సాగు చేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నామని మంత్రి అన్నారు. ప్రధాని ప్రతి అంశాన్నీ ఓపికగా విని, వివరాలు అడిగి తెలుసుకున్నారని, రాష్ట్ర విజ్ఞప్తులను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం లేదని నిపుణులు స్పష్టంగా చెప్పారని మంత్రి తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఒకే రకమైన సీకెంట్ పైల్ పునాదులు ఉన్నాయి. పునాదుల రూపకల్పనలో, నిర్మాణంలో లోపాలను నిపుణులు లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీని రూపకల్పన చేసి నిర్మించిన గత ప్రభుత్వ హయాంలోనే అది దెబ్బతింది. ఇప్పుడు అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయాలని కోరడం అర్థరహితమని ఉత్తమ్ అన్నారు. ప్రాణహిత-చేవెళ్లకు రూ.11 వేల కోట్లు వెచ్చించి 30 శాతం పనులు పూర్తయ్యాక తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మళ్లించారని ఉత్తమ్ చెప్పారు. కమిషన్ల కోసమే గత ప్రభుత్వం ఈ మార్పు చేసిందని ఆరోపించారు. దిగువకు ప్రవహిస్తున్న గోదావరి జలాలను ప్రస్తుతం దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని పేర్కొన్నారు.

కొత్త పింఛన్లు 4.63 లక్షలు

మొదటి పేజీ తరువాయి

5 వర్గాలకు ప్రధాన ప్రాధాన్యత ఇచ్చారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలతో పాటు కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులను అర్హులుగా ఎంపిక చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించారు. జిల్లాల వారీగా ఎంపికైన లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తే, రాష్ట్రంలోనే అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 35,730 మంది కొత్త పెన్షన్లకు అర్హత సాధించారు. ఆ తర్వాతి స్థానాల్లో రంగారెడ్డి జిల్లాలో 30,232 మంది, నల్గొండ జిల్లాలో 26,546 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ఏజెన్సీ, తక్కువ జనాభా కలిగిన జిల్లాల్లో లబ్ధిదారుల సంఖ్య తక్కువగా నమోదైంది. ముఖ్యంగా ములుగు జిల్లాలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 4,087 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 6,457 మంది మాత్రమే కొత్త పెన్షన్లకు ఎంపికైనట్లుగా ప్రభుత్వం వెల్లడించింది. ఎంపికైన లబ్ధిదారులందరికీ ఈ నెల 19న నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి పెన్షన్ నగదును జమ చేయనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో, లక్షలాది పేద కుటుంబాలకు తక్షణ ఆర్థిక ఊరట లభించనుంది.

శబరిమల మెట్లపైకి నిమిషానికి 75 మందికే అనుమతి

మొదటి పేజీ తరువాయి

సన్నాహాలు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఈ ఏడాది యాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసిందని ఆయన అన్నారు. సాధారణంగా ఆర్థిక మంత్రులు నిధుల కేటాయింపు విషయంలో కఠినంగా ఉంటారని భావించినప్పటికీ, శబరిమల అభివృద్ధికి ముఖ్యమంత్రి ఉదారంగా మద్దతు ఇచ్చారని ఆయన చెప్పారు. చాలకాయం-పంప రహదారి పునరుద్ధరణ కేవలం ఒకటిన్నర నెలల్లోనే పూర్తయిందని ప్రజా పనుల శాఖ మంత్రి పీకే బషీర్ అన్నారు. పని వేగాన్ని ప్రస్తావిస్తూ, కృషి చేస్తే పనస చెట్లు కూడా తమ వేళ్ల నుండే ఫలాలను ఇస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి వల్లే రూ. 553 కోట్ల శబరిమల అభివృద్ధి ప్యాకేజీకి ఆమోదం లభించిందని కూడా ఆయన పేర్కొన్నారు. 65 రోజుల పాటు జరిగే మండల-మకరవిళక్కు యాత్రా కాలం కోసం శబరిమల ఆలయం రేపు తెరుచుకుంటుంది. సాయంత్రం 5 గంటలకు, తంత్రి కందరారు బ్రహ్మదాతన్ సమక్షంలో మేల్శాంతి ఈడీ ప్రసాద్ నంబూతిరి ఆలయాన్ని తెరిచి, శ్రీకోవిల్ లోపల దీపాన్ని వెలిగిస్తారు. యాత్రికుల భద్రత, సౌకర్యాలను నిర్ధారించడానికి వివిధ ప్రభుత్వ శాఖలు తుది ఏర్పాట్లను పూర్తి చేస్తున్నాయి. పంపా, సన్నిధానం వద్ద ఆరోగ్య సంరక్షణ, తాగునీరు, పారిశుధ్యం, రవాణాకు సంబంధించిన సౌకర్యాలు ఏర్పాటు చేయబడ్డాయి.

కొండగట్టులో వైభవంగా చందనోత్సవం ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

ఆలయ ఆచార సంప్రదాయాల ప్రకారం సింధూరం తొలగింపుతో పాటు ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్ఛారణలు, యాగశాల కార్యక్రమాలతో మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. నవంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు ఆరు రోజుల పాటు వివిధ హోమాలు, జపాలు, పారాయణాలు, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో అత్యంత విశిష్టమైన ఘట్టంగా నవంబర్ 20 నుంచి డిసెంబర్ 29 వరకు సుమారు 40 రోజుల పాటు భక్తులకు స్వామివారి నిజరూప దర్శనానికి అవకాశం కల్పించనున్నారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత లభిస్తున్న ఈ అరుదైన దర్శన భాగ్యం కోసం భక్తులు ఎదురుచూస్తున్నారు. అనంతరం డిసెంబర్ 29న మండలాభిషేకం నిర్వహించి స్వామివారికి తొలి విడత చందన లేపనం సమర్పించనున్నారు. ఇదిలా ఉండగా, చందనోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో ఆలయ గర్భగుడిని తాత్కాలికంగా మూసివేశారు. ఐదు రోజుల పాటు గర్భగుడిలో స్వామివారి దర్శనానికి అవకాశం ఉండదని, భక్తుల సౌకర్యార్థం ఆలయం ఎదుట స్వామివారి ప్రతిమను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఐదు రోజుల పాటు భక్తులు ఆ ప్రతిమ రూపంలోనే అంజన్నను దర్శించుకోవాల్సి ఉంటుంది. చందనోత్సవం నేపథ్యంలో కొండగట్టు క్షేత్రంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

సిగ్గూ శరం లేదా?

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర అధ్యక్షుడు గతంలో అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి చర్యలను గుర్తుచేస్తూ, ఇది అత్యంత సిగ్గుచేటైన, అనుచితమైన ప్రవర్తన అని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని ఆయన స్పష్టం చేశారు. కాగా, రాహుల్ గాంధీ బైక్ వెనుక తాను పరిగెత్తడంపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత ఇచ్చారు. తాను కూడా బైక్‌పైనే వెళుతున్న క్రమంలో వాహనం స్కిడ్ అయ్యిందని, రాహుల్ గాంధీ తనను గమనించి పక్కకు పిలిచారని తెలిపారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉన్నందునే పక్కనే పరిగెత్తుకుంటూ వెళ్లానని, రాహుల్ గాంధీ వెంట అలా పరిగెత్తడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని నీతులు చెబితే సరిపోదని, ముందుగా రాజ్యాంగ విలువలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికింది. ఏ హోదాలో, ఏ ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్నారని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ శనివారం గిగ్ వర్కర్ల సంక్షేమ ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ముగింపు సభలో ప్రసంగించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఈ ప్రశ్నలను సంధించింది.

2031 ప్రపంచ కప్ ఆతిథ్య హక్కులు భారత్‌కు

మొదటి పేజీ తరువాయి

విండోలను ఖరారు చేసి ఆమోదం తెలిపారు. ఇక 2027, 2028 సంవత్సరాల్లో జరగనున్న టోర్నీల వివరాలను పరిశీలిస్తే.. 2027 జూన్ 9 నుంచి 13 వరకు ఇంగ్లాండ్‌లోని ది ఓవల్ వేదికగా డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది. అదే ఏడాది అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు జింబాబ్వే, నమీబియా సంయుక్త ఆతిథ్యంలో వన్డే ప్రపంచ కప్ నిర్వహిస్తారు. అదేవిధంగా 2028లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వేదికలుగా అక్టోబర్ 12 నుంచి నవంబర్ 12 వరకు టీ20 ప్రపంచ కప్ జరగనుంది. 2029 నుంచి 2031 మధ్య కాలంలో భారత్, ఇంగ్లాండ్ దేశాల్లో కీలక టోర్నీలు జరగనున్నాయి. 2029 జూన్ 8 నుంచి 12 వరకు ఇంగ్లాండ్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుండగా, అక్టోబర్ 9 నుంచి 28 వరకు భారత్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించనున్నారు. 2030 జులై 4 నుంచి ఆగస్టు 4 వరకు ఇంగ్లాండ్, ఐర్లాండ్, స్కాట్లాండ్ సంయుక్తంగా టీ20 ప్రపంచ కప్‌కు ఆతిథ్యమివ్వనున్నాయి. 2031 జూన్ 12 నుంచి 16 వరకు ఇంగ్లాండ్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్, అక్టోబర్ 9 నుంచి నవంబర్ 23 వరకు భారత్, బంగ్లాదేశ్ వేదికలుగా వన్డే ప్రపంచ కప్ జరగనున్నాయి. 2032 నుంచి 2035 వరకు జరగనున్న ఐసీసీ టోర్నమెంట్ల తేదీలను ఖరారు చేసినప్పటికీ, ఆయా టోర్నీలకు ఆతిథ్యమిచ్చే దేశాలను ఇంకా ప్రకటించలేదు. ఈ విండో ప్రకారం 2032 అక్టోబర్ 14 నుంచి నవంబర్ 14 వరకు టీ20 ప్రపంచ కప్, 2033 జూన్ 9 నుంచి 13 వరకు డబ్ల్యూటీసీ ఫైనల్, అదే ఏడాది అక్టోబర్ 2 నుంచి 23 వరకు ఛాంపియన్స్ ట్రోఫీ జరగనున్నాయి. అలాగే 2034 జులై 6 నుంచి ఆగస్టు 6 వరకు టీ20 ప్రపంచ కప్, 2035 జూన్ 7 నుంచి 11 వరకు డబ్ల్యూటీసీ ఫైనల్, అక్టోబర్ 2 నుంచి నవంబర్ 18 వరకు వన్డే ప్రపంచ కప్ నిర్వహించేందుకు ఐసీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది.



కొండగట్టు ఆలయంలో రూ.23 కోట్ల నిధుల గోల్‌మాల్?

ఆడిట్‌లో బయటపడ్డ అవకతవకలు.. ఏళ్లుగా ముందుకు సాగని విచారణ

జగిత్యాల, నవంబర్ 15 (ఈవార్తలు): ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో రూ.23 కోట్ల మేర నిధుల అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆడిట్ నివేదికలో ఈ మేరకు వ్యత్యాసాలు బయటపడినా, ఏళ్లుగా విచారణ ముందుకు సాగకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2013-14 నుంచి 2017-18 మధ్య జరిగిన ఆడిట్‌లో తొలుత రూ.2.26 కోట్ల మేర అభ్యంతరాలు నమోదయ్యాయి. తదుపరి ఆడిట్‌లలో ఈ మొత్తం రూ.23 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. హుండీ ఆదాయం, ఆర్జిత సేవల టికెట్ల ద్వారా వచ్చిన డబ్బులు పూర్తిగా ఖజానాకు జమ కాలేదని, ప్రసాదాల తయారీకి కొనుగోలు చేసిన సరుకుల లెక్కల్లోనూ తేడాలు ఉన్నాయని ఆడిట్ విభాగం గుర్తించినట్లు సమాచారం. ఈ నిధుల దుర్వినియోగానికి ఆలయ ఉద్యోగులే బాధ్యులని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమాలపై విచారణ జరపాలని 2022లో అప్పటి ఆలయ ఈవో ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీంతో వేములవాడ ఆలయ ఈవోను విచారణాధికారిగా నియమిస్తూ అదే ఏడాది ఆగస్టులో ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2025లో మరోసారి విచారణకు ఆదేశాలు ఇచ్చినా, పురోగతి కనిపించలేదని సమాచారం. ఇటీవల విధుల్లో చేరిన ఓ ఉద్యోగి ఈ ఫైల్‌ను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది .విచారణ పెండింగ్‌లో ఉండగానే ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఉద్యోగులు పదోన్నతులు పొంది ఇతర ఆలయాలకు బదిలీ కాగా, మరికొందరు ఉద్యోగ విరమణ చేసినట్లు సమాచారం. విచారణ ఆలస్యంపై దేవాదాయ శాఖలోని కొందరు అధికారుల తీరుపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, గత ఆగస్టులో ఇదే ఆలయంలో రూ.49.29 లక్షల నిధుల దుర్వినియోగానికి సంబంధించి నలుగురు ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఒకరిని ఉద్యోగం నుంచి తొలగించగా, మరో ముగ్గురి ఇంక్రిమెంట్లను నిలిపివేశారు. ఆలయంలో 60 ఏళ్ల తర్వాత చారిత్రక చందనోత్సవం నవంబర్ 16 నుంచి జరగనున్న నేపథ్యంలో రూ.23 కోట్ల అవకతవకల



ఆరోపణలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి.



హరీశ్‌రావు తండ్రి సంవత్సరీకానికి కేసీఆర్

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన మేనల్లుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసానికి వెళ్లారు. హరీశ్‌రావు తండ్రి దివంగత సత్యనారాయణరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రంగారెడ్డి జిల్లా నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేటలో ఉన్న హరీశ్‌రావు నివాసానికి చేరుకున్న కేసీఆర్.. సత్యనారాయణరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం హరీశ్‌రావు, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొన్నారు. సత్యనారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితర నేతలు హాజరై హరీశ్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.



తెలంగాణలో భారీ వర్షాల హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి తుపానుగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఈ తుపానుకు 'అక్వాన్'గా పేరు పెట్టారు. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ తుపాను ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ నవంబర్ 20 నాటికి ఉత్తర కోస్తాంధ్ర తీరాన్ని దాటే అవకాశం ఉంది. దీని ప్రభావంతో నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. 21, 22 తేదీల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ తుపాను ప్రభావం కనిపించవచ్చని తెలిపారు.

ఐదు ట్రావెల్స్ బస్సులు దగ్ధం

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): హైదరాబాద్ శివారు బొంరంపేటలో శనివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఓ ప్రైవేట్ పార్కింగ్ యార్డులో నిలిపి ఉంచిన ఐదు ట్రావెల్స్ బస్సులు మంటలకు ఆహుతయ్యాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడ్రాయి సమీపంలో ఉన్న పార్కింగ్ స్థలంలో బస్సులను ఒకదానికొకటి దగ్గరగా నిలిపి ఉంచారు. ఓ బస్సులో మొదలైన మంటలు వేగంగా పక్కనున్న బస్సులకు వ్యాపించాయి. దీంతో మూడు బస్సులు పూర్తిగా దగ్ధం కాగా, మరో రెండు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అర్ధరాత్రి సమయంలో దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు, సమీపంలోని పెట్రోల్ బంక్ సిబ్బంది అగ్నిమాపక కేంద్రానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీడిమెట్ల ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. సమీపంలోని చెత్తకుప్పకు నిప్పు అంటుకుని బస్సులకు వ్యాపించిందా అనే కోణంలోనూ విచారణ చేస్తున్నారు. ఆస్తి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు.



మురసు తుపానుతో ఏపీకి రూ.2,484 కోట్ల నష్టం



అమరావతి, నవంబర్ 15 (ఈవార్తలు): మురసు తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,484 కోట్ల మేర ఆస్తులు, పంటలకు నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. బాధితులను ఆదుకునేందుకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందంతో ఆదివారం ఆయన వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం క్షేత్రస్థాయిలో తాము పరిశీలించిన పరిస్థితులను ముఖ్యమంత్రికి వివరించింది. వరుస తుపాన్లు, ఎల్‌నినో ప్రభావంతో రైతాంగంతో పాటు పలు కీలక రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చంద్రబాబు తెలిపారు. భవిష్యత్తులో తుపాన్లను తట్టుకునేలా తీర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు కేంద్రం ఆర్థిక సహకారం అందించాలని కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను త్వరగా సమర్పించి, రాష్ట్రానికి తక్షణ సాయం అందేలా చూడాలని సూచించారు. ఆకస్మిక వరదలతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ స్తంభాలు భారీగా దెబ్బతిన్నాయని కేంద్ర బృందం తెలిపింది. అయితే ప్రభుత్వం ముందుగానే కాలువలు, వాగుల్లో పూడికతీత పనులు చేపట్టడంతో నష్టం తీవ్రత కొంత తగ్గిందని పేర్కొంది. అర్నాబ్ తుపానుతో పోలిస్తే మురసు ప్రభావానికి తూర్పుగోదావరి జిల్లాలో 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు వరి పంట దెబ్బతిన్నట్లు వివరించింది. మామిడి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకూ భారీ నష్టం వాటిల్లిందని తెలిపింది. పత్తి రైతులకు బీమా ప్రీమియం అధికంగా ఉండటంతో చాలామంది బీమా చేయించుకోలేకపోయారని, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అధిక పరిహారం అందించాలని సూచించింది. బాధితులకు నెల రోజుల్లో మూడుసార్లు రేషన్ పంపిణీ, విద్యార్థులకు యూనిఫాంలు, గిరిజనులకు ప్రత్యేక సాయం అందించే అంశాలను పరిశీలించాలని పేర్కొంది. చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని బృందం రెండుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 60 ప్రాంతాల్లో పర్యటించింది. చీరాల, బాపట్ల, పర్చూరు, చిలకలూరిపేట, సూరప్పగూడెం, నిడమర్రు తదితర ప్రాంతాల్లో పంట పొలాలు, కాలువలు, రహదారులు, విద్యుత్ వ్యవస్థ, మత్స్యకారుల బోట్లకు జరిగిన నష్టాన్ని పరిశీలించింది. బాధిత రైతులతోనూ మాట్లాడింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమిక అంచనాల ప్రకారం.. 1,385 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతినడంతో రూ.888 కోట్ల నష్టం వాటిల్లింది. వ్యవసాయ రంగంలో 1,43,617 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులకు రూ.875 కోట్ల నష్టం జరిగింది. ఉద్యాన పంటలు 6,756 హెక్టార్లలో దెబ్బతిని రూ.337 కోట్ల నష్టం వాటిల్లింది. విద్యుత్ రంగంలో 10,192 హెచ్‌టీ (11 కేవీ) స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 3,859 ఇళ్లు ధ్వంసమయ్యాయి. సహాయక చర్యల కోసం ఇప్పటికే రూ.37 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర బృందానికి సమర్పించిన నివేదికలో ప్రభుత్వం వెల్లడించింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో తుది చార్జిషీట్ సిద్ధం?

కేసీఆర్, కేటీఆర్‌లను నిందితులుగా చేర్చనున్నట్లు ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఏ1గా, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ2గా పేర్కొంటూ తుది చార్జిషీట్ దాఖలు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

చట్టవిరుద్ధమని తెలిసినా ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతులు ఇచ్చారని, తమకు అనుకూలంగా ఉండే అధికారులను ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ వంటి కీలక విభాగాల్లో నియమించి అక్రమాలకు పాల్పడ్డారని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీల ఫోన్లను ట్యాప్ చేయడం వెనుక కుట్ర ఉందని దర్యాప్తులో గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై సిట్ అధికారులు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించినట్లు సమాచారం. వందలాది మంది బాధితుల వాంగ్మూలాలతో పాటు ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారంతో బెదిరించి, ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు సేకరించారన్న ఆరోపణలపై ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారినట్లు సమాచారం. చార్జిషీట్ రూపకల్పనలో సుప్రీంకోర్టు న్యాయనిపుణుల సలహాలు కూడా తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో సహకరించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల పేర్లను కూడా చార్జిషీట్‌లో చేర్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, చార్జిషీట్ దాఖలు, అందులో పేర్కొననున్న నిందితుల వివరాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



ఎయిర్‌టెల్ టవర్ పరికరాల చోరీ

సొంత ఉద్యోగులే దొంగలు.. ముఠా అరెస్ట్.. 38 చోట్ల చోరీలు

రూ.1.62 కోట్ల విలువైన సామగ్రి స్వాధీనం

నల్లగొండ, నవంబర్ 15 (ఈవార్తలు): మొబైల్ టవర్ల నుంచి విలువైన పరికరాలను దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నల్గొండ పోలీసులు పట్టుకున్నారు. ఎయిర్‌టెల్‌లో పనిచేస్తున్న ప్రస్తుత, మాజీ ఉద్యోగులు సహా తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.1.62 కోట్ల విలువైన టవర్ పరికరాలు, నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. టవర్లలో కీలక పరికరాలు మాయమవుతున్నాయన్న ఫిర్యాదులతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్‌రెడ్డి నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నవంబర్ 14న వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముఠా సభ్యులు పట్టుబడ్డారు. అరెస్టయిన వారిలో ముగ్గురు ఇంజనీర్లు, నలుగురు టవర్ రిగ్గర్లు/టెక్నీషియన్లు, ఒక డ్రైవర్, ఒక మాజీ ఎయిర్‌టెల్ ఉద్యోగి ఉన్నారు. టవర్లలోని సాంకేతిక వ్యవస్థలు, అక్కడి పరిస్థితులపై అవగాహన ఉండటంతో పథకం ప్రకారం చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రాత్రివేళల్లో టవర్ ప్రాంతాలకు వెళ్లి నెట్‌వర్క్‌కు కీలకమైన రేడియో రిమోట్ యూనిట్లను తొలగించేవారని వివరించారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 38 చోరీలకు పాల్పడినట్లు విచారణలో నిందితులు వెల్లడించారని పోలీసులు తెలిపారు. మిర్యాలగూడలో 16, నల్గొండలో 9, సూర్యాపేటలో 8, దేవరకొండలో 2, ఇతర జిల్లాల్లో 3 చోరీలు చేసినట్లు పేర్కొన్నారు. త్రిపురారం, నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. దొంగిలించిన పరికరాలను హైదరాబాద్‌లో విక్రయించేవారని, ఆ డబ్బుతో కార్లు, బైకులు కొనుగోలు చేసి విలాసవంతంగా గడిపేవారని పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి రూ.25 లక్షల విలువైన మూడు కార్లు, రెండు మోటార్ సైకిళ్లు, రూ.15 లక్షల నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి భక్తుల సందర్శనకు ఎస్వీ మ్యూజియం

తిరుమల, నవంబర్ 15 (ఈవార్తలు): తిరుమలలో ఆధునీకరించిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియం (ఎస్వీ మ్యూజియం) సోమవారం నుంచి సాధారణ భక్తులకు అందుబాటులోకి రానుంది. తిరుమల ప్రాశస్త్యం, సనాతన ధర్మ వైభవం, వేల ఏళ్ల చరిత్రను ప్రతిబింబించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ఈ మ్యూజియాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సాంకేతిక సహకారంతో నాలుగు అంతస్తుల్లో, దాదాపు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో మ్యూజియాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో 14 ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. 8,000కు పైగా పురాతన కళాఖండాలు, చారిత్రక ఆధారాలు, రాతి, కాంస్య శిల్పాలు, నాణేలు, పురాతన ఆయుధాలు, పూజా సంప్రదాయాలకు సంబంధించిన వస్తువులతో పాటు డిజిటల్ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. మ్యూజియంలో 'బ్రహ్మాండం గ్యాలరీ' ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. విశ్వం, సృష్టి రహస్యాలు, బ్రహ్మాండ విస్తృతిని వివరించేలా అత్యాధునిక సాంకేతికతతో దీన్ని రూపొందించారు. హోలోగ్రాఫిక్ ప్రదర్శనలు, 360 డిగ్రీల సౌండ్ సిస్టమ్, డిజిటల్ విజువల్స్ ద్వారా సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించనున్నారు. పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు, సంప్రదాయ సంగీత వాయిద్యాల కోసం ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేశారు. శ్రీవారి చరిత్ర, ఆలయ నిర్మాణ పరిణామ క్రమాన్ని వివరించే డిజిటల్ ఆర్కైవ్స్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



స్వగ్రామంలో గిరిబాబుకు కన్నీటి వీడ్కోలు

రావినూతల, నవంబర్ 15 (ఈవార్తలు): ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (83) అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ఆయన స్వగ్రామం ప్రకాశం జిల్లా రావినూతలలో ముగిశాయి. బంధుమిత్రులు, గ్రామస్థులు, అభిమానులు అశ్రునయనాల మధ్య ఆయనకు ఆఖరి వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లో నవంబర్ 14న తుదిశ్వాస విడిచిన గిరిబాబు భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు రావినూతలకు తరలించారు. తన అంతిమ సంస్కారాలు స్వగ్రామంలోనే జరగాలన్న గిరిబాబు చివరి కోరిక మేరకు కుటుంబ సభ్యులు అక్కడే ఏర్పాట్లు చేశారు. ఆయన పెద్ద కుమారుడు, నటుడు రఘుబాబు అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామ శ్మశానవాటికలో బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తండ్రి చితికి రఘుబాబు నిప్పంటించారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి సినీ రంగంలో నటుడిగా గుర్తింపు తెచ్చుకుని తిరిగి స్వగ్రామంలోనే అంతిమయాత్ర సాగించడంతో రావినూతలలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. స్థానికులు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు చిత్ర పరిశ్రమలో కొనసాగిన గిరిబాబు సుమారు 600కు పైగా సినిమాల్లో నటించారు. విలన్‌గా, సహాయ నటుడిగా, హాస్య నటుడిగా విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించారు. ఆయన మృతిపై సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. తెలుగు చిత్ర పరిశ్రమ ఒక గొప్ప నటుడిని కోల్పోయిందని సహచర నటులు పేర్కొన్నారు.

ఫోన్ ఇవ్వకుండానే ఈఎంఐలు కట్

స్టోర్‌కు రూ.1.14 లక్షల జరిమానా, పరిహారం

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): మొబైల్ ఫోన్ డెలివరీ చేయకుండానే ఈఎంఐలు వసూలు చేసిన ఎలక్ట్రానిక్స్ స్టోర్‌కు హైదరాబాద్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ షాక్ ఇచ్చింది. బాధితుడికి ఫోన్ ధరను తిరిగి చెల్లించడంతో పాటు మానసిక వేదనకు పరిహారం, కోర్టు ఖర్చులు ఇవ్వాలని ఆదేశించింది. అలాగే అతని పేరు మీద ఉన్న లోన్ ఖాతాను పూర్తిగా మూసివేయాలని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన 34 ఏళ్ల వ్యక్తి 2024 మార్చిలో జీరో పర్సెంట్ వడ్డీ ఈఎంఐ పద్ధతిలో మొబైల్ కొనుగోలు చేసేందుకు ఓ ఎలక్ట్రానిక్స్ స్టోర్‌ను సంప్రదించాడు. అవసరమైన పత్రాలు సమర్పించగా, ఫైనాన్స్ కంపెనీ రుణాన్ని ఆమోదించింది. ఫోన్ డిస్పాచ్ ప్రక్రియ కోసం స్టోర్ ఎగ్జిక్యూటివ్ అతని నుంచి ఓటీపీ తీసుకున్నాడు. అయితే, ఎంతకాలమైనా ఫోన్ డెలివరీ కాలేదు. త్వరలో పంపిస్తామని లేదా డబ్బులు తిరిగి ఇస్తామని స్టోర్ నిర్వాహకులు చెబుతూ కాలయాపన చేశారు. మరోవైపు, 2024 ఏప్రిల్ 3న బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి తొలి ఈఎంఐ కింద రూ.4,204 కట్ అయింది.



గౌతమ్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

కూకట్‌పల్లి, నవంబర్ 15 (ఈవార్తలు): గౌతమ్ నగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి బీజేపీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలానగర్, చింతల్‌లోని ఆర్ఎన్‌సీ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సి. రమేష్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంచి మహేందర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ సి. రమేష్‌తో పాటు సొసైటీ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో రఘు బట్టా రాధేశ్యామ్, సొసైటీ అధ్యక్షుడు భరత్, ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు ఆకాష్, జాయింట్ సెక్రటరీ సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఫతేనగర్‌లో ఘనంగా ఛట్ పూజ వేడుకలు

కూకట్‌పల్లి: ఫతేనగర్ డివిజన్‌లోని శివాలయం సమీపంలో బిహారీ సోదరులు నిర్వహించిన ఛట్ పూజ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఛట్ పూజ ప్రకృతి ఆరాధనకు, సూర్య భగవానుడిపై భక్తి విశ్వాసాలకు ప్రతీక అని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ సంప్రదాయాలు, ఆచారాల ప్రకారం పండుగలు జరుపుకోవడం భారతీయ సంస్కృతిలోని ప్రత్యేకత అని పేర్కొన్నారు. అన్ని మతాలు, కులాలు, ప్రాంతాలకు చెందిన ప్రజలు సోదరభావంతో, ఐకమత్యంగా కలిసి ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ ఛట్ పూజ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. కార్యక్రమంలో క్రాంతి, సూరజ్ తివారి, లక్ష్మయ్య, ఇజాజ్, నరసింహ, శ్రవణ్, ఎల్. నర్సింగ్, కిరణ్, తమిళ్, రవి తదితరులు పాల్గొన్నారు.



జోనల్ చాంపియన్‌గా అల్వాల్ ఎస్ఆర్ డీజీ స్కూల్

నాలుగు ఖో-ఖో విభాగాల్లో విజయం

కొంపల్లి జోన్‌కు చాంపియన్‌షిప్ ట్రోఫీ

హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): ఎస్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో కొంపల్లి, దిల్‌సుఖ్‌నగర్ జోన్ల మధ్య నిర్వహించిన 2026-27 వార్షిక క్రీడా పోటీల్లో కొంపల్లి జోన్‌కు ప్రాతినిధ్యం వహించిన ఎస్ఆర్ డీజీ స్కూల్, అల్వాల్ ఓవరాల్ జోనల్ చాంపియన్‌గా నిలిచింది. నవంబర్ 11న అల్వాల్ ఎస్ఆర్ క్యాంపస్‌లో ప్రారంభమైన పోటీలు నవంబర్ 14న బొల్లారం క్యాంపస్‌లో ముగిశాయి. ఖో-ఖోలో ఎస్ఆర్ డీజీ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ బాలుర, సీనియర్ బాలికల, జూనియర్ బాలుర, జూనియర్ బాలికల విభాగాల్లో విజేతలుగా నిలిచి నాలుగు విభాగాల్లోనూ గెలుపొందారు. దీంతో ప్రతిష్ఠాత్మక జోనల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. కొంపల్లి బ్రాంచ్‌లో నిర్వహించిన అంతర్గత పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లోనూ విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. ఈ పోటీలు సంస్థల వ్యవస్థాపకుడు, చైర్‌పర్సన్ ఎ. వరదారెడ్డి, డైరెక్టర్ ఎ. సంతోష్ రెడ్డి నాయకత్వంలో జరిగాయి. డీజీఎం కె. రాధికా రెడ్డి మార్గదర్శకత్వంలో, కొంపల్లి జోనల్ ఇన్‌చార్జి ఎం. మనోహర్ సమన్వయంతో పోటీలు నిర్వహించారు. అల్వాల్ పాఠశాల ప్రిన్సిపాల్ వీణా కుమారి, పీఈటీ అమీన్ బాబు శిక్షణ, మార్గదర్శకత్వం అందించారు. విజేతలైన విద్యార్థులు, శిక్షకులు, ఉపాధ్యాయ సిబ్బందిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

పద్మశాలి ఉద్యోగుల జిల్లా కమిటీల పునర్వ్యవస్థీకరణ



హైదరాబాద్, నవంబర్ 15 (ఈవార్తలు): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం అల్కాపురిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని జిల్లాల కమిటీలను పునర్వ్యవస్థీకరించాలని సమావేశం నిర్ణయించింది. 2027 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముద్రించి అన్ని జిల్లాలకు పంపిణీ చేయాలని తీర్మానించారు. రాష్ట్ర కమిటీలో ఏర్పడిన రెండు ఖాళీలకు చెన్న ప్రణీత్ కుమార్, వేసాల శ్రీదేవిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఏకగ్రీవంగా నియమించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అనంతుల లక్ష్మీనారాయణ అకాల మరణంపై సమావేశం సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మృతికి నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన కుటుంబానికి సంఘం తరఫున రూ.లక్ష ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనంతుల లక్ష్మీనారాయణ మరణం సంఘానికి తీరని లోటని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు జరగకుండా ఉద్యోగులు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి లేదా సంఘం రాష్ట్ర కమిటీకి తీసుకురావాలని సూచించారు. ప్రతి సభ్యుడికి సంఘం అండగా ఉంటుందని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎనగండ్ల రాహుల్ కుమార్, సంస్థాగత కార్యదర్శి శిరందాసు యాదగిరేందర్, కోశాధికారి రాపోలు సోమేశ్వర్, ఉపాధ్యక్షులు పిట్ట ఉమాదేవి, గంజి రాంమోహన్, డాక్టర్ వెన్నెలదాసు శ్రీనివాస్, ఆడెపు మల్లిఖార్జున్, జాయింట్ సెక్రటరీ కడవేరు లక్ష్మీపతి, ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు దేవులపల్లి రాజేశ్వర్, చిలుక శ్రీనివాస్, నోముల చంద్రశేఖర్, ఉషకోయల రాజేందర్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కెంచె సుభాష్ చంద్రబోస్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు బూర ఉమాశంకర్, భద్రాద్రి కొత్తగూడెం ప్రధాన కార్యదర్శి దూలం నటరాజ్, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వరప్రసాద్, తిరుమల విజయలక్ష్మి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఇప్పకాయల విష్ణుమూర్తి, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రచ్చ గణేష్, బోగ గణేష్, చెన్న ప్రణీత్ కుమార్, వేసాల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

2027లో చైనా కంటే భారత్ వృద్ధి వేగం

7.2 శాతం జీడీపీ వృద్ధి ఉంటుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లోనూ వేగంగా వృద్ధి చెందనుందని అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. 2027లో భారత్ 7.2 శాతం జీడీపీ వృద్ధిని నమోదు చేసి, చైనా కంటే వేగంగా అభివృద్ధి చెందుతుందని తన తాజా నివేదికలో పేర్కొంది. ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపింది. 2027లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2.8 శాతం వృద్ధి చెందవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. 2026లో ఇది 2.7 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా కఠిన ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికీ ఇంధన ధరలు తగ్గడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారీ పెట్టుబడులు రావడం వృద్ధికి ఊతమిస్తాయని వివరించింది. గోల్డ్‌మన్ శాక్స్ ప్రధాన ఆర్థికవేత్త, రీసెర్చ్ విభాగం అధిపతి జాన్ హట్జియస్ మాట్లాడుతూ.. ఇంధన ఖర్చులు, సాంకేతిక రంగంలో పెట్టుబడులు, ప్రభుత్వాల ద్రవ్య విధానాలు ప్రపంచ ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదకాలుగా మారుతున్నాయని తెలిపారు. 2027లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని నమోదు చేయవచ్చన్నారు. భారత్ 7.2 శాతం వృద్ధి సాధిస్తుందని అంచనా వేయగా, మార్కెట్ సాధారణ అంచనా 6.8 శాతంగా ఉంది. 2026లో భారత్ వృద్ధి రేటు 7.9 శాతంగా ఉండొచ్చని నివేదిక పేర్కొంది. మరోవైపు 2027లో చైనా ఆర్థిక వ్యవస్థ 4.5 శాతం వృద్ధికే పరిమితం కావచ్చని అంచనా వేసింది. అక్కడ రియల్ ఎస్టేట్ రంగ సమస్యలు, దేశీయ వినియోగం మందగించినప్పటికీ ఎగుమతులు కొంత ఊతమిస్తాయని వివరించింది. అమెరికా, జపాన్, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు మార్కెట్ అంచనాల కంటే మెరుగైన వృద్ధిని నమోదు చేయవచ్చని నివేదిక తెలిపింది. ఏఐ ఎగుమతులకు ఉన్న డిమాండ్‌తో దక్షిణ కొరియా, తైవాన్ లబ్ధి పొందుతాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో పెట్టుబడులు 2026లో 1.1 ట్రిలియన్ డాలర్ల నుంచి 2027లో 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరవచ్చని అంచనా వేసింది. ఇందులో అమెరికా హార్డ్‌వేర్ రంగంలోనే 500 బిలియన్ డాలర్లకు పైగా అదనపు వ్యయం జరగవచ్చని తెలిపింది. ఇది ప్రపంచ జీడీపీ వృద్ధికి 0.4 శాతం మేర దోహదం చేయవచ్చని విశ్లేషించింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గడం కూడా ఆర్థిక కార్యకలాపాలకు కలిసిరానుంది. 2027 చివరి నాటికి బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 78 డాలర్లకు దిగివచ్చే అవకాశం ఉందని, ఎల్ఎన్‌జీ ధరలు కూడా తగ్గుతాయని గోల్డ్‌మన్ శాక్స్ కమోడిటీ నిపుణులు అంచనా వేశారు. అయితే ఐరోపా దేశాలు పెరిగిన ఇంధన ఖర్చుల ప్రభావాన్ని మరికొంతకాలం ఎదుర్కోవాల్సి ఉంటుందని నివేదిక పేర్కొంది.



మాగంటి సునీత గోపీనాథ్‌కు నవీన్ పటేల్ అభినందనలు

జూబ్లీహిల్స్, నవంబర్ 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజాక్షేత్రంలో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మాగంటి సునీత గోపీనాథ్‌ను సీనియర్ నాయకుడు నవీన్ పటేల్ పార్టీ శ్రేణులతో కలిసి అభినందించారు. యూసఫ్‌గూడలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతున్నారని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. దివంగత మాగంటి గోపీనాథ్ ఆశయాల సాధన కోసం సునీత గోపీనాథ్ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణమోహన్, అజయ కుమారి, అమ్మాజీ, నాగరాజు, ధర్మ, బొట్టు శివ, చంద్రశేఖర్, రియాజ్, వసీం, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్, సంతోషి, సువర్ణ కుమారి, రమా, వెంకటేష్, పద్మ, దత్తు తదితరులు పాల్గొన్నారు.

తిరుచెందూర్‌లో శూరసంహారం

4,100 మంది పోలీసులతో భద్రత

భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు



చెన్నై: తమిళనాడులోని ప్రసిద్ధ తిరుచెందూర్ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆదివారం జరగనున్న శూరసంహారం కార్యక్రమానికి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 4,100 మంది పోలీసులను మోహరించారు. వార్షిక కంద షష్ఠి ఉత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఈ కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. మురుగన్ ఆరు పవిత్ర క్షేత్రాల్లో రెండోది అయిన ఈ సముద్రతీర ఆలయంలో శూరపద్ముడనే రాక్షసుడిపై స్వామివారు సాధించిన విజయానికి గుర్తుగా శూరసంహారం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్వామి జయంతినాథర్‌ను ఊరేగింపుగా సముద్రతీరానికి తీసుకువస్తారు. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. నవంబర్ 10న యాగశాల పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి ఆలయ ప్రాంగణంలోనే బస చేస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తూత్తుకుడి జిల్లా ఎస్పీ శివప్రసాద్ పర్యవేక్షణలో భద్రతా చర్యలు చేపట్టారు. జనసమూహాన్ని నియంత్రించేందుకు బారికేడ్లు, వాచ్‌టవర్లు ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టారు. సముద్ర స్నానాల సమయంలో భక్తులు లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా తీరంలో ఫ్లోటింగ్ బారియర్లు అమర్చారు. శూరసంహారం అనంతరం సంతృప్తి మండపంలో స్వామివారికి విశేష అలంకరణ, దీపారాధన నిర్వహిస్తారు. ఉత్సవాల్లో ఏడో రోజైన సోమవారం రాత్రి స్వామి కుమరవిడంగ పెరుమాళ్, దేవనాయకి అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది.

చైనా ఎలక్ట్రిక్ విమానం తొలి ప్రయాణం సక్సెస్

57 నిమిషాల పరీక్ష.. 19 మంది ప్రయాణించే సామర్థ్యం



విమానయాన రంగంలో చైనా మరో కీలక ముందడుగు వేసింది. ప్రభుత్వ రంగ సంస్థ కోమాక్ అభివృద్ధి చేసిన పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ వాణిజ్య విమానం 'సీఈ-25ఏ' తొలిసారిగా విజయవంతంగా గాల్లోకి ఎగిరింది. షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని బిన్‌జౌ నగరంలో శనివారం ఈ ప్రయోగాత్మక పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఇద్దరు పైలట్లు, ఒక ఫ్లైట్-టెస్ట్ ఇంజినీర్ పాల్గొన్నారు. మొత్తం 57 నిమిషాల పాటు సాగిన ప్రయాణంలో విమానం 16 నిమిషాలకు పైగా గాల్లో ఉంది. ఈ సమయంలో 60.4 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. విమానం పనితీరు సంతృప్తికరంగా ఉందని, అన్ని వ్యవస్థలూ నిర్దేశిత లక్ష్యాల మేరకు పనిచేశాయని కోమాక్ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ విమానం తొలి మానవరహిత ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. ప్రధానంగా సమీప నగరాల మధ్య ప్రయాణాల కోసం దీన్ని రూపొందించారు. 19 మంది ప్రయాణికులను తీసుకెళ్లగల ఈ విమానం గరిష్టంగా 10 టన్నుల బరువుతో టేకాఫ్ అయ్యే సామర్థ్యం కలిగి ఉంది. గంటకు 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. దీని గరిష్ట రేంజ్ 400 కిలోమీటర్లు. రెక్కలకు అమర్చిన 10 ఎలక్ట్రిక్ డక్టెడ్ ఫ్యాన్ల సాయంతో విమానం పనిచేస్తుంది. ప్రముఖ బ్యాటరీ తయారీ సంస్థ సీఏటీఎల్, షాంఘై జియావో టాంగ్ యూనివర్సిటీ తదితర సంస్థల భాగస్వామ్యంతో కోమాక్ దీన్ని అభివృద్ధి చేసింది. పైలట్ల పర్యవేక్షణతో పాటు అటానమస్ మోడ్‌లోనూ పనిచేయగలదు. ఈ విమానానికి టైప్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోమాక్ చేసిన దరఖాస్తును చైనా సివిల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఇప్పటికే ఆమోదించింది.

మరణశిక్షపై భారత్ వైఖరి స్పష్టం

ఐరాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు



న్యూఢిల్లీ: మరణశిక్షల అమలుపై ప్రపంచవ్యాప్తంగా తాత్కాలిక నిషేధం విధించాలంటూ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం (యూఎన్‌జీఏ) థర్డ్ కమిటీలో ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానానికి భారత్ వ్యతిరేకంగా ఓటు వేసింది. మెక్సికో ప్రతిపాదించిన ఈ తీర్మానానికి 133 దేశాలు అనుకూలంగా ఓటు వేయగా, భారత్‌తో పాటు 33 దేశాలు వ్యతిరేకించాయి. మరో 16 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయని 'ది హిందూ' కథనం పేర్కొంది. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ భవిక మంగళానందన్ దేశ వైఖరిని వివరించారు. మరణశిక్ష విషయంలో ప్రపంచ దేశాల మధ్య ఏకాభిప్రాయం లేదని ఆమె తెలిపారు. ప్రతి సార్వభౌమ దేశానికి తన న్యాయ వ్యవస్థను, తగిన శిక్షలను నిర్ణయించుకునే హక్కు ఉందన్నారు. భారత్‌లో సరైన న్యాయ ప్రక్రియ, విస్తృతమైన రక్షణలను అనుసరించిన తర్వాతే అత్యంత అరుదైన కేసుల్లో (రేరెస్ట్ ఆఫ్ రేర్) మరణశిక్ష విధిస్తామని ఆమె స్పష్టం చేశారు. చట్టబద్ధమైన విచారణ అనంతరం విధించే మరణశిక్షను అన్యాయమైన హత్యలతో లేదా హింసతో పోల్చడం సరికాదని భారత్ పేర్కొంది. ఈ తీర్మానాన్ని భారత్‌తో పాటు అమెరికా, చైనా, జపాన్, పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలు కూడా వ్యతిరేకించాయి. తమ దేశ చట్టాలకు అనుగుణంగా, న్యాయ సమీక్షల తర్వాతే తీవ్రమైన నేరాలకు శిక్షలు అమలు చేస్తామని భారత్ మరోసారి స్పష్టం చేసింది.

న్యూయార్క్‌కు మళ్లీ ఎయిరిండియా నాన్‌స్టాప్ సర్వీసులు



న్యూఢిల్లీ: భారత్ నుంచి అమెరికా వెళ్లే ప్రయాణికులకు ఎయిరిండియా శుభవార్త అందించింది. ఢిల్లీ, ముంబై నుంచి న్యూయార్క్‌కు నేరుగా నడిచే నాన్‌స్టాప్ విమాన సర్వీసులను పునరుద్ధరించింది. గగనతల ఆంక్షలు సడలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. దీంతో ప్రయాణ సమయం సుమారు ఐదు గంటల వరకు తగ్గనుంది. పశ్చిమాసియాలో గగనతల ఆంక్షల కారణంగా గతంలో ఎయిరిండియా విమానాలు సుదీర్ఘ మార్గంలో ప్రయాణించాల్సి వచ్చేది. మధ్యలో ఇంధనం నింపుకోవడానికి ఇటలీలోని రోమ్‌లో టెక్నికల్ స్టాప్ తీసుకునేవి. దీంతో ప్రయాణానికి దాదాపు 22 గంటలు పట్టేది. తాజాగా నాన్‌స్టాప్ సర్వీసులు పునరుద్ధరించడంతో ఈ సమయం సుమారు 17 గంటలకు తగ్గింది. భారత విమానాలకు పాకిస్థాన్ తన గగనతలాన్ని ఇంకా మూసివేసే ఉంచినప్పటికీ, ఇరాక్ గగనతలం తిరిగి అందుబాటులోకి రావడంతో తక్కువ సమయంలో ప్రయాణించే అవకాశం ఏర్పడింది. గతంలో ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియాలోని కొన్ని ప్రాంతాల్లో విమానాల రాకపోకలపై ఆంక్షలు విధించారు.

విమానాల షెడ్యూల్:

- **ఢిల్లీ-న్యూయార్క్: ప్రతిరోజూ ఒక సర్వీసు**
- **ముంబై-న్యూయార్క్: ప్రతిరోజూ ఒక సర్వీసు**
- **ఢిల్లీ-నెవార్క్: వారానికి నాలుగు సర్వీసులు**
- **ముంబై-నెవార్క్: వారానికి మూడు సర్వీసులు**

ఈ మార్గాల్లో ఎయిరిండియా అత్యాధునిక విమానాలను నడుపుతోంది. ఢిల్లీ నుంచి వెళ్లే విమానాలకు ఎయిర్‌బస్ ఏ350-900ను కేటాయించింది. ఇందులో పూర్తి ఫ్లాట్ బెడ్ సదుపాయమున్న 28 బిజినెస్ సూట్లు, 24 ప్రీమియం ఎకానమీ, 264 ఎకానమీ సీట్లు ఉన్నాయి. ముంబై మార్గంలో బోయింగ్ 777-300ఈఆర్ విమానాలను ఉపయోగిస్తోంది. వీటిలో ఎనిమిది ఫస్ట్‌క్లాస్ సూట్లు, 40 ఫ్లాట్ బెడ్ బిజినెస్ క్లాస్ సీట్లు, 280 ఎకానమీ సీట్లు ఉన్నాయి. నాన్‌స్టాప్ సర్వీసులతో పాటు మెరుగైన క్యాబిన్ సదుపాయాలు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయని సంస్థ తెలిపింది.

భారత్‌లోకి విదేశీ పెట్టుబడుల వెల్లువ

నవంబర్ 13 నాటికే రూ.79,301 కోట్ల ఎఫ్‌పీఐ కొనుగోళ్లు



న్యూఢిల్లీ: భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) కొనుగోళ్ల వేగం పెంచారు. దాదాపు 10 వారాల పాటు నికర విక్రయదారులుగా ఉన్న విదేశీ ఇన్వెస్టర్లు నవంబర్ ఆరంభం నుంచి వరుసగా పెట్టుబడులు పెడుతున్నారు. ఈ నెల 13వ తేదీ నాటికే రూ.79,301 కోట్ల విలువైన భారతీయ ఈక్విటీలను కొనుగోలు చేశారు. ఇదే జోరు కొనసాగితే నవంబర్ నెలలో ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఆల్‌టైమ్ రికార్డు సృష్టించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామంపై జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ డాక్టర్ వి.కె. విజయకుమార్ స్పందించారు. అమెరికా కాంగ్రెషనల్ ఎన్నికల్లో డెమొక్రాట్ల విజయం ఏఐ స్టాక్స్‌లో అమ్మకాలకు దారితీసిందని, ఏఐ వ్యయం, నియంత్రణలకు ఆ పార్టీ అనుకూలంగా ఉండటంతో పెట్టుబడులు ఏఐయేతర రంగాల వైపు మళ్లాయని వివరించారు. ఈ క్రమంలో మెరుగైన వృద్ధి అవకాశాలున్న భారత మార్కెట్లకు విదేశీ నిధులు వస్తున్నాయని తెలిపారు. దేశీయ కంపెనీల రెండో త్రైమాసిక ఫలితాలు మెరుగుపడటం కూడా మార్కెట్‌కు కలిసొచ్చింది. 2027 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 50 కంపెనీల ఆదాయం దాదాపు 15 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భారత లార్జ్‌క్యాప్ షేర్ల విలువలు ఆకర్షణీయంగా మారడం, రూపాయి మారకం విలువ స్థిరంగా ఉండటం విదేశీ ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచాయి. బ్యాంకింగ్ రంగంలోని కీలక లార్జ్‌క్యాప్ షేర్లలో షార్ట్ కవరింగ్ జరగడం సూచీల ర్యాలీకి మద్దతిచ్చింది. గత వారం ఎఫ్‌పీఐలు రూ.33,340 కోట్ల పెట్టుబడులు పెట్టగా, అంతకుముందు వారం సుమారు రూ.45,960 కోట్లు పెట్టారు. మరోవైపు దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐలు) మాత్రం వరుసగా రెండో వారమూ అమ్మకాలు జరిపారు. గత వారంలోని నాలుగు ట్రేడింగ్ సెషన్లలో రూ.24,190 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.



ఉద్యమాలు పుడతాయి..విస్తరిస్తాయి..
సమాజాన్ని కదిలిస్తాయి..తరాల జీవితాలను ప్రభావితం చేస్తాయి..
విజయాపజయాలనూ చవిచూస్తాయి..
చరిత్రలో అధ్యాయాలను లిఖించుకుంటాయి.
ఒకానొక చారిత్రక దశలో ముగిసిపోతాయి కూడా..!
కానీ..,
ఉద్యమాలు ముగిస్తే జ్ఞాపకాలు ముగిసిపోతాయా?
ఆ ఉద్యమాలను మోసిన మనుషుల కథలు కనుమరుగవుతాయా?
ఆ ఉద్యమాల కోసం బిడ్డలను కన్న తల్లుల చరిత్ర ఎక్కడ ముగుస్తుంది?



ఆ తల్లి కన్నీ చరిత..!

జైళ్లలో మగ్గుతున్న కొడుకుల కోసం ఎదురుచూసిన తల్లులు, అజ్ఞాతంలో ఉన్న బిడ్డల క్షేమం కోసం తల్లడిల్లిన తల్లులు, అర్ధరాత్రి తలుపుతట్టిన ఉద్యమకారులకు అన్నం వండిపెట్టిన తల్లులు, పోలీసుల నిర్బంధాల మధ్య భయాన్ని గుండెల్లో దాచుకొని బతికిన తల్లులు.. వీళ్లంతా ఏ చరిత్ర పుస్తకంలో ఉన్నారు? తెలంగాణ విప్లవోద్యమ చరిత్రను రాసేటప్పుడు నాయకుల పేర్లు రాస్తాం. పార్టీల గురించి, సభల గురించి, పోరాటాల గురించి, నిర్బంధాల గురించి, అమరవీరుల గురించి రాస్తాం. కానీ ఆ ఉద్యమాలకు అన్నం వండిన చేతుల గురించి, ఆశ్రయమిచ్చిన ఇళ్ల గురించి, తమ బిడ్డలతో పాటు ఇతరుల బిడ్డలనూ కన్నబిడ్డలుగా చూసుకున్న అమ్మల గురించి ఎంత రాశాం? అలాంటి ఒక తల్లి అల్లం బుచ్చమ్మ. కరీంనగర్ జీవగడ్డలోని గాజులపల్లెలో అల్లం నర్సయ్యతో కలిసి ఆమె పెంచిన ముగ్గురు కొడుకులు.. అల్లం రాజయ్య, అల్లం వీరయ్య, అల్లం నారాయణ. ఒక కుటుంబానికి చెందిన వ్యక్తులుగా మాత్రమే మిగలలేదు. తెలంగాణ భూస్వామ్య వ్యతిరేక పోరాటాల సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ ప్రస్థానంలో తమదైన ముద్ర వేశారు.

జగిత్యాల జైత్రయాత్ర నుంచి గాజులపల్లె దాకా

తెలంగాణ రైతాంగ పోరాటాల చరిత్రలో జగిత్యాల జైత్రయాత్ర ఒక చారిత్రక మలుపు. భూస్వామ్య ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, గ్రామీణ సమాజంలో పాతుకుపోయిన దోపిడీ సంబంధాలను సవాలు చేస్తూ సాగిన ఆ ప్రస్థానం అనేక గ్రామాలను, కుటుంబాలను ఉద్యమంలోకి తీసుకొచ్చింది. అయితే అల్లం కుటుంబానికి ఆ ఉద్యమంతో ఏర్పడిన సంబంధాన్ని అర్థం చేసుకోవాలంటే 1975 ఎమర్జెన్సీ కాలం నుంచే చూడాలి. 1975 జూన్ 26న మంథనిలో జరిగిన సంస్మరణ సభ, జననాట్యమండలి ప్రదర్శన నేపథ్యంలో పోలీసు చర్యలు మొదలయ్యాయి. నారాయణ, వీరయ్యతో పాటు వారి సహచరుల జీవితాల్లో అరెస్టులు, కేసులు, నిర్బంధాలు ప్రవేశించాయి. ఎమర్జెన్సీ సమయంలో నారాయణ, కృష్ణారెడ్డి సిద్ధిపేటలో అరెస్టయ్యారు. నారాయణతో సంబంధాలున్నాయనే కారణంతో వీరయ్యను కూడా లాకప్‌లో ఉంచారు. ఆ కాలంలో అనేక మంది యువకులు నెలల తరబడి పోలీసు నిర్బంధాలను, చిత్రహింసలను ఎదుర్కొన్నారు. కొందరు 1977 జూలై వరకు జైల్లో ఉన్నారు. ఇవన్నీ రాజకీయ చరిత్రలో సంఘటనలు. కానీ ఆ సంఘటనలు జరిగినప్పుడు గాజులపల్లెలోని అల్లం నర్సయ్య, బుచ్చమ్మల ఇంట్లో పరిస్థితి ఏమిటి? పోలీసులు కొడుకులను తీసుకెళ్లినప్పుడు ఆ తల్లి ఎవరిని అడిగి తెలుసుకుంది? జైల్లో ఉన్న బిడ్డకు ఏమైందో తెలియని రాత్రులు ఎలా గడిచాయి? కేసులు, అరెస్టులు, విడుదలల మధ్య కుటుంబ జీవితం ఎలా సాగింది? ఇవి మనం ఇంకా తెలుసుకోవాల్సిన ప్రశ్నలు.

1978 ఏప్రిల్‌లో రాడికల్ విద్యార్థులు గ్రామాలకు వెళ్లి రైతుకూలీ సంఘాల నిర్మాణంలో పాల్గొన్నారు. పాలేర్ల జీతాల పెంపు, కూలిరేట్లు, వెట్టి రద్దు, దున్నేవాడికి భూమి వంటి నినాదాలతో గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యమం విస్తరించింది. 1978 సెప్టెంబర్ 8న జరిగిన జగిత్యాల జైత్రయాత్ర ఆ ప్రస్థానంలో కీలక ఘట్టమైంది. ఆ ఉద్యమ కార్యక్రమాల నిర్వహణలో అల్లం నారాయణ ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆ తరువాత ఆయన పూర్తికాలపు ఉద్యమ కార్యకర్తగా పనిచేశారు. 1980ల తొలి సంవత్సరాల్లోనూ ఆ ప్రస్థానాన్ని కొనసాగించి 1985 వరకు ఉద్యమంలో ఉన్నారు. 1980 ఏప్రిల్ 20న గాజులపల్లిలోని గుడిమెట్టు లొద్దిలో పీపుల్స్ వార్ పార్టీ ఏర్పడింది. ఇది గాజులపల్లె చరిత్రకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన విషయం. ఒకప్పుడు అడవిని నరికి భూమి సాగులోకి తెచ్చినా ఆ భూమిపై హక్కులు కోల్పోయిన కుటుంబాల ఊరు, తరువాత భూమి హక్కుల కోసం సాగిన ఉద్యమాలకు వేదిక కావడం చరిత్రలో ఒక విశేషమైన పరిణామం. ఈ రెండు చారిత్రక దశల మధ్య అల్లం కుటుంబం ఉంది. ఆ కుటుంబంలో బుచ్చమ్మ ఉంది. ఒకరి అమ్మ.. అందరి అమ్మ! ఆ కాలపు ఉద్యమ జీవితంలో 'కుటుంబం' అనే మాటకు కొత్త అర్థం ఏర్పడింది. పోరెడ్డి వెంకటరెడ్డి, మల్లా రాజిరెడ్డి, బయ్యపు దేవేందర్ రెడ్డి, గజ్జెల గంగారాం వంటి సహచరులతో అల్లం కుటుంబానికి ఏర్పడిన అనుబంధం కేవలం రాజకీయ సంబంధం కాదు. కష్టాల్లో, నిర్బంధాల్లో, అనిశ్చితిలో ఏర్పడిన ఆత్మీయమైన మానవ సంబంధం.

అల్లం రాజయ్య తన జ్ఞాపకాల్లో ఒకచోట ఇలా రాశారు: "మా ఇంటి నిండా ఎప్పుడు మనుషులే." మరోచోట అల్లం నారాయణ "మిత్రులతో తమ ఇల్లు నిరంతరం నిండిపోయి" ఉండేదని గుర్తుచేసుకున్నారు. ఆ రెండు వాక్యాలు చదివినప్పుడు మనకు ఆ ఇంటి రాజకీయ ప్రాధాన్యం అర్థమవుతుంది. కానీ ఆ ఇంటి రోజువారీ జీవితం గురించి మరో ప్రశ్న ఎదురవుతుంది. ఎప్పుడూ మనుషులతో నిండిపోయే ఇంట్లో పొయ్యి ఎన్నిసార్లు వెలిగేది? వచ్చినవాళ్లకు అన్నం ఎవరు వండిపెట్టేవారు? వాళ్లు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితుల్లో ఇంటి పనులు ఎలా సాగేవి? అందరికీ ఆశ్రయం ఇచ్చిన ఆ ఇంటిని నిలబెట్టడానికి ఎంత శ్రమ అవసరమయ్యేది? ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతికినప్పుడు బుచ్చమ్మ వంటి మహిళల శ్రమ కనిపిస్తుంది. ఒకరి కొడుకు మరొకరి ఇంటికి వచ్చేవాడు. ఒకరి ఇంట్లో మరొకరు ఆశ్రయం పొందేవారు. ఒకరి తల్లి అందరికీ అన్నం పెట్టేది. జాగ్రత్తలు చెప్పేది. అవసరమైనప్పుడు దాచిపెట్టేది. ప్రమాదం పొంచి ఉందని తెలిసినప్పుడు హెచ్చరించేది.

ఎవరి బిడ్డ ఎక్కడున్నాడో తెలియని రాత్రుల్లో అందరి తల్లులూ ఒకే ఆందోళనను పంచుకునేవారు. పోలీసులు ఇంటికి వచ్చినప్పుడు, కొడుకులు కేసుల మధ్య కోర్టుల చుట్టూ తిరుగుతున్నప్పుడు, సమాజ పరివర్తన కోసం పనిచేస్తున్న తమ బిడ్డలను చుట్టూ ఉన్నవాళ్లు అనుమానంగా చూస్తున్నప్పుడు.. బుచ్చమ్మ మనసులో ఎన్ని అలజడులు రేగి ఉంటాయో! పగలంతా అందరి ముందు ధైర్యంగా నిలబడిన ఆ తల్లి, అర్ధరాత్రి అందరూ నిద్రపోయాక ఒంటరిగా కన్నీళ్లు పెట్టుకొని ఏడిచేది. ఆ కన్నీళ్లు తన కొడుకుల కోసమే కాదు. తన ఇంటికి వచ్చి వెళ్లే ప్రతి బిడ్డ క్షేమం కోసం కూడా. అర్ధరాత్రి ఏ బిడ్డ తలుపుతట్టినా తలుపు తెరవడం, పొయ్యి వెలిగించి అన్నం వండిపెట్టడం, అతని క్షేమసమాచారాన్ని తెలుసుకోవడం, అవసరమైన జాగ్రత్తలు చెప్పడం.. ఇలాంటి బాధ్యతలతోనే ఆ కాలపు అనేక ఉద్యమ కుటుంబాల జీవితం సాగింది. తన ఇంటికి వచ్చిన ప్రతి యువకుడిలోనూ తన బిడ్డను చూసే మాతృత్వం ఆ ఇళ్లకు బలమైంది. అలా ఒకరి అమ్మ అందరి అమ్మ అయింది. రక్తసంబంధాలకు అతీతంగా ఏర్పడిన ఆ మాతృత్వానికి రాజకీయ సిద్ధాంతాల కంటే లోతైన మానవీయ పునాది ఉంది. తన కొడుకుకు అన్నం పెట్టే తల్లి, అతని సహచరుడికి కూడా అదే ప్రేమతో అన్నం పెట్టింది. తన బిడ్డ కోసం భయపడినట్లే మరొకరి బిడ్డ కోసం భయపడింది. ఆ తల్లులు రాజకీయ తీర్మానాలు చేసి ఉండకపోవచ్చు. సభల్లో ప్రసంగించి ఉండకపోవచ్చు. పార్టీ పత్రాలను చదివి ఉండకపోవచ్చు. కానీ ఉద్యమ జీవితంలోని అత్యంత కష్టమైన బాధ్యతలను మౌనంగా మోశారు. వాళ్లు ఉద్యమ సిద్ధాంతాలను పుస్తకాల్లో చదవలేదు. తమ బిడ్డల జీవితాల్లో చదివారు. ఈ చరిత్రలో తల్లుల పక్కనే తండ్రులూ ఉన్నారు. అక్షరజ్ఞానం అంతగా లేని గ్రామీణ తండ్రులు తమ కొడుకుల విడుదల కోసం కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. నిన్నటిదాకా పొలం, పంట, కుటుంబం తప్ప మరొక ప్రపంచం తెలియని మనుషులకు పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలు, న్యాయవాదులు, బెయిళ్లు, వాయిదాలు జీవితంలో భాగమయ్యాయి.

అల్లం నర్సయ్య వంటి తండ్రుల అనుభవాన్ని కూడా ఈ నేపథ్యంలో చూడాలి. పదేళ్ల వయసులో పాలేరు జీవితాన్ని ఎదిరించిన నర్సయ్య, తరువాత తన కొడుకులు ఎంచుకున్న రాజకీయ మార్గం వల్ల ఎదురైన సంఘర్షణలనూ చూడాల్సి వచ్చింది. వాళ్లు విశ్వవిద్యాలయాల్లో రాజకీయ శాస్త్రం చదవలేదు. వాళ్లకు కోర్టు మెట్లు రాజకీయ పాఠశాలలయ్యాయి. ఒకవైపు తమ బిడ్డల భవిష్యత్తు గురించి భయం. మరోవైపు వాళ్లు ఎంచుకున్న మార్గాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం. ఈ రెండింటి మధ్య ఆ తరం తల్లిదండ్రులు అనుభవించిన మానసిక సంఘర్షణను ఏ రాజకీయ చరిత్ర పూర్తిగా చెప్పగలదు? గాజులపల్లె.. ఉట్టి నేల కాదు, ఉట్టి గోడలు కావు! గాజులపల్లె పేరు దాదాపు యాభై సంవత్సరాలుగా తెలుగు సాహిత్య ప్రపంచానికి సుపరిచితం. ఆ ఊరు అల్లం రాజయ్య కథల్లో, నవలల్లో సజీవంగా కనిపిస్తుంది. అక్కడి మనుషులు, పంచాయితీలు, సామాజిక సంఘర్షణలు, భూస్వామ్య సంబంధాలు ఆయన సాహిత్యానికి జీవితానుభవాలను అందించాయి. ఆ ఊరిలోనే రాజయ్య, వీరయ్య, నారాయణల బాల్యం, కౌమారం, తొలి యవ్వనం గడిచాయి. అల్లం రాజయ్య బాల్యస్మృతుల్లో కనిపించే గాజులపల్లె ఒక విచిత్రమైన ప్రపంచం. ఒకవైపు ఆకలి, అంటరానితనం, వెట్టి, భూస్వామ్య పెత్తనం, కులపంచాయితీలు, దౌర్జన్యాలు. మరోవైపు ఆ దౌర్జన్యాలను ఎదిరించే సాధారణ మనుషులు. పొలాల్లో, మంచెల దగ్గర, నెగళ్ల చుట్టూ, ఇంటి వాకిళ్లలో నిరంతరం కథలు చెప్పుకునే ప్రజలు. రాజయ్య తన తండ్రి నర్సయ్య గురించి చెప్పిన ఒక విషయం ఎంతో ముఖ్యమైనది. ఆయన రోజంతా కథలతోనే మాట్లాడేవాడట. అంటే కథలు చెప్పడం ఆ ఇంటికి బయట నుంచి వచ్చిన సాహిత్య అలవాటు కాదు. అది ఆ కుటుంబం బతికిన సమాజపు సహజమైన వ్యక్తీకరణ. అక్కడ కథ చెప్పడం ఒక కళ మాత్రమే కాదు. బతుకును అర్థం చేసుకునే పద్ధతి. బాధను పంచుకునే భాష. ప్రతిఘటనను ఒక తరం నుంచి మరో తరానికి అందించే మౌఖిక చరిత్ర. అలాంటి కథల ప్రపంచంలో పెరిగిన రాజయ్య తరువాత ప్రజల జీవితాలనే సాహిత్యంగా మలచడం యాదృచ్ఛికం కాదు. ఆయన స్వయంగా తన బాల్యంలో పరిచయమైన మహిళల నుంచి, దళితుల నుంచి, శ్రమజీవుల నుంచి, కార్మికుల నుంచి ఎంతో నేర్చుకున్నానని రాశారు. ఆ అనుభవాలన్నీ కలిసే ఆయన సాహిత్య దృక్పథాన్ని నిర్మించాయి. గాజులపల్లెలోని అల్లం కుటుంబం ఇల్లు తరువాత రాజకీయ చర్చలకు, సాహిత్య సంభాషణలకు, ఉద్యమ అనుభవాలకు వేదికైంది. కొండపల్లి సీతారామయ్య, కె.జి. సత్యమూర్తి, ఐ.వి. సాంబశివరావు, నల్లా ఆదిరెడ్డి, మల్లోజుల కోటేశ్వరరావు వంటి ఉద్యమ నాయకులతో ఆ కుటుంబానికి సంబంధాలు ఏర్పడ్డాయి. వారి రాకపోకలు, సమావేశాలు, చర్చల జ్ఞాపకాలు ఆ ఇంటి చరిత్రలో భాగమయ్యాయి. ఐ.వి. సాంబశివరావు రాజకీయ తరగతులు నిర్వహించిన గ్రామం కూడా అదే. ఆ ఇంటి గదులు కేవలం నివాస స్థలాలు కావు. ఒక కాలపు రాజకీయ చర్చలకు, సాహిత్య సంభాషణలకు, ఉద్యమ అనుభవాలకు సజీవ సాక్ష్యాలు.

1988
మార్చి 29న ఆంధ్రజ్యోతి దినపత్రికలో అల్లం నారాయణ రాసిన 'అమ్మ' కవితను ఈ సందర్భంగా మరోసారి గుర్తుచేసుకోవాలి. ఆ కవితలో అమ్మ కేవలం ప్రేమకు ప్రతీక కాదు. ఆమె ఒక శ్రమజీవి. పొలంలో పనిచేసే మహిళ. తన చెమటతో బిడ్డల జీవితాలను నిర్మించిన మనిషి. తన ఆకలిని దాచుకొని బిడ్డల ఆకలి తీర్చిన తల్లి. తన కళ్లలో చీకట్లను దాచుకొని పిల్లలకు వెన్నెల నవ్వులను పంచిన తల్లి. అన్నింటికంటే ముఖ్యంగా తన బిడ్డకు ప్రపంచాన్ని పరిచయం చేసిన తల్లి. ఆ కవితలోని ఒక దృశ్యం మనల్ని వెంటాడుతుంది. తల్లి తన బిడ్డ కోసం ప్రపంచానికి కిటికీ తెరుస్తుంది. ఆ కిటికీ గుండా బిడ్డ అవతలి ప్రపంచంలోకి

ప్రపంచానికి కిటికీ తెరిచిన అమ్మ

దూకుతాడు. కానీ తల్లి మాత్రం వంటింటి గడప మీద శిలగా మిగిలిపోతుంది. ఎంతటి విషాదం ఇది! బిడ్డలకు స్వేచ్ఛా ప్రపంచాన్ని చూపించిన తల్లి, తన జీవితంలో మాత్రం సంప్రదాయాల సంకెళ్ల నుంచి బయటపడలేకపోయింది. పసుపు కుంకుమలు, తాళిబొట్టు, పాతివ్రత్య ధర్మం.. వీటన్నింటి మధ్య బంధించబడిన స్త్రీ జీవితాన్ని నారాయణ ఆ కవితలో ప్రశ్నించారు. ఈ కవితను ఇప్పుడు, బుచ్చమ్మ మరణానంతరం చదివితే, అది కేవలం ఒక కొడుకు తన తల్లి గురించి రాసిన కవితగా అనిపించదు. తమ బిడ్డలను కొత్త ప్రపంచంలోకి పంపి, తాము మాత్రం పాత ప్రపంచపు గడపల మీద మిగిలిపోయిన వేలాది తెలంగాణ తల్లుల జీవితానికి అది ప్రతీకగా కనిపిస్తుంది. తమలాంటి తల్లుల జీవితాల్లోని శ్రమను, నిర్బంధాలను, మౌనాన్ని మార్చడానికి ఆ తరం బిడ్డలు బయలుదేరారు. అయితే ప్రపంచాన్ని మార్చాలని బయలుదేరిన బిడ్డలు, తమకు ప్రపంచాన్ని పరిచయం చేసిన అమ్మల జీవితాలను ఎంతవరకు మార్చగలిగారు?

(అల్లం బుచ్చమ్మ స్మృతిలో..)

బుచ్చమ్మా!

నీ కొడుకులు ప్రపంచాన్ని చూడాలని బయలుదేరినప్పుడు
నువ్వు ఇంటి గడప దగ్గర నిలబడి ఉన్నావు.
వాళ్లు తిరిగి రావాలని ఎదురుచూశావు.
వాళ్లతో పాటు వచ్చిన సహచరులకు అన్నం పెట్టావు.
వాళ్ల కష్టాలను నీ కష్టాలుగా మోశావు.
నీ ఇంటి పాయ్యి మీద వండిన అన్నం ఎంతమంది ఆకలిని తీర్చిందో!
నీ ఇంటి గడప దాటిన బిడ్డలు ఎన్ని దారుల్లో ప్రయాణించారో!
వాళ్లలో కొందరు రచయితలయ్యారు. కొందరు గాయకులయ్యారు.
కొందరు ఉద్యమకారులయ్యారు. కొందరు చరిత్రలో పేర్లుగా మిగిలారు.
కానీ ఆ ప్రయాణాల వెనుక ఉన్న నీ జీవితం గురించి
మనం ఇంకా చాలా తెలుసుకోవాల్సి ఉంది.
నువ్వు ప్రపంచానికి తెరిచిన ఆ కిటికీ గుండా
నీ బిడ్డలు చాలా దూరం ప్రయాణించారు.
ఆ కిటికీ దగ్గర నిలిచిన నీ శ్రమను, నీ ఎదురుచూపులను,
నీ మౌనాన్ని ఇప్పుడు చరిత్రగా చదవాలి.
ఉద్యమం ముగిసిపోయి ఉండవచ్చు.
కానీ ఆ ఉద్యమాలకు బిడ్డలను కన్న తల్లుల చరిత్ర ముగిసిపోలేదు.
అది వాళ్ల బిడ్డల జ్ఞాపకాల్లో, వాళ్లు రాసిన అక్షరాల్లో, పాడిన పాటల్లో,
వాళ్లను ఆశ్రయించిన ఇళ్లలో ఇంకా బతికే ఉంది.
అమ్మా... నువ్వు లేవు. కానీ నీ కథ ఇంకా మిగిలే ఉంది!
అది జ్ఞాపకమై పలవరిస్తూనే ఉంటది.
గాథలై విస్తరిస్తూనే ఉంటది.
వేలాది బిడ్డల మనసుల్లో మరో రూపం తీసుకుంటూనే ఉంటది.
(అల్లం బుచ్చమ్మ గారి 11వ రోజు సంస్మరణ సందర్భంగా.. 16 నవంబర్ 2026)

– గజ్జెల కిరణ్





ముగ్గురు కొడుకులు.. మూడు వ్యక్తీకరణలు

బుచ్చమ్మ పెంచిన ముగ్గురు కొడుకుల జీవితాలు తరువాత వేర్వేరు మార్గాల్లో సాగాయి. అల్లం రాజయ్య తన కథలు, నవలల ద్వారా తెలంగాణ గ్రామీణ జీవితాన్ని, శ్రమజీవుల సంఘర్షణలను, సామాజిక వైరుధ్యాలను సాహిత్యంలోకి తీసుకొచ్చారు. ఆయన సాహిత్య ప్రపంచం గాజులపల్లెతో ఆగిపోలేదు. మంచిర్యాల సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగ జీవితం, సింగరేణి కార్మికులతో ఏర్పడిన అనుబంధం, ఆదివాసీ ప్రాంతాల అనుభవాలు ఆయన రచనలకు కొత్త ప్రపంచాలను పరిచయం చేశాయి. రాజయ్య తన జ్ఞాపకాల్లో కార్మికుల నుంచి, ఆదివాసుల నుంచి, దళితుల నుంచి, ప్రజాకళాకారుల నుంచి నేర్చుకున్న విషయాలను విస్తృతంగా వివరించారు. ఆయనకు ప్రజలు కేవలం కథల్లోని పాత్రలు కాదు. తనకు జీవితాన్ని నేర్పిన గురువులు. అల్లం వీరయ్య ప్రజల పాటల్లో తన స్వరాన్ని కలిపారు. గాజులపల్లె జానపద జీవితం నుంచి పుట్టిన సహజమైన గీతాన్ని ఉద్యమ గీతంగా మలిచిన ఆయన సృజనశక్తికి 'ఎర్రజెండెర్రజెండెన్నియలో' పాట ఒక గొప్ప ఉదాహరణ. రాజయ్య జ్ఞాపకాల ప్రకారం, వీరయ్య పాటలు గద్దర్, జననాట్యమండలి కళాకారులు, నారాయణ వంటి వారి గానం ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాయి. 'పిలగాని ఏడుపు', 'వాసన', 'రెండు మరణాలు' వంటి కథలూ వీరయ్య సాహిత్య కృషిలో భాగమే. ఒక ప్రాంతపు జానపద బాణీ ప్రజా ఉద్యమాల సాంస్కృతిక వ్యక్తీకరణగా మారిన ప్రయాణం అది. అల్లం నారాయణ కవిత్వం, జర్నలిజం, సంపాదకీయ బాధ్యతల ద్వారా తన ప్రజాజీవన ప్రస్థానాన్ని కొనసాగించారు. జగిత్యాల జైత్రయాత్ర నిర్వహణ నుంచి పూర్తికాలపు ఉద్యమ జీవితం వరకు, 'జగిత్యాల పల్లె', 'ప్రాణహిత' వంటి కవితా సంపుటాల నుంచి తెలంగాణ జర్నలిస్టుల ఉద్యమం వరకు, తెలంగాణ రాష్ట్ర సాధన ప్రస్థానం నుంచి తెలంగాణ ప్రెస్ అకాడమీ అధ్యక్ష బాధ్యతల వరకు ఆయన జీవితంలో అనేక అధ్యాయాలున్నాయి. ఈ ముగ్గురి బాల్యం, యవ్వనం కేవలం ఆటపాటలతో గడిచిపోలేదు. తెల్లవారుజాముల దాకా రాజకీయాలు, సాహిత్యం, సామాజిక పరిణామాలు, ఉద్యమాల గురించి చర్చించుకునేవారు. గొప్ప గొప్ప పుస్తకాలను చదివేవారు. చదివిన విషయాలపై వాదించుకునేవారు. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేవారు. ఆ ఇంట్లో పుస్తకాలు కేవలం చదువుకునే వస్తువులు కావు. ఆలోచనలను రగిలించే సాధనాలు.



పనికోసం వేధింపులు భరించా



ఈవార్తలు, వినోదవాణి: సినిమా అవకాశాలు కోల్పోతాననే భయంతో కెరీర్ ఆరంభంలో లైంగిక వేధింపులను భరించాల్సి వచ్చిందని బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ వెల్లడించారు. 2011లో ఓ సినిమా షూటింగ్ సమయంలో దర్శకుడి నుంచి వేధింపులు ఎదుర్కొన్నానని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అప్పట్లో జరిగిన ఘటన తనను మానసికంగా తీవ్రంగా కుంగదీసిందని గుర్తుచేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని పచ్‌మఢీలో సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని స్వరా చెప్పారు. "అప్పుడు నా వయసు ఇరవైల్లోనే ఉంది. ఓ సినిమా విజయంతో ఇండస్ట్రీలో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. నాకు పెద్దగా పరిచయాలు లేవు. పీఆర్ టీమ్, సపోర్ట్ సిస్టమ్ కూడా లేదు. ఎవరి సహాయం తీసుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నాను. దర్శకుడు ఆ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకున్నారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో దర్శకుడు తనను శారీరకంగా తాకకపోవడంతో అది వేధింపుల కిందకు వస్తుందని మొదట్లో గుర్తించలేకపోయానని తెలిపారు. మీటూ ఉద్యమం తర్వాత ఇతర మహిళలు ఎదుర్కొన్న అనుభవాలను విన్నప్పుడే తనకు జరిగినది కూడా లైంగిక వేధింపేనని అర్థమైందన్నారు. శారీరక దాడి జరగకపోతే వేధింపు కాదనే అపోహలో తానూ కొంతకాలం ఉన్నానని చెప్పారు. సినిమా మధ్యలోనే వదిలేయాలని ఎందుకు అనుకోలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. అప్పట్లో కెరీర్‌ను నిర్మించుకోవాలనే తపన బలంగా ఉండేదని తెలిపారు. 56 రోజుల షూటింగ్ షెడ్యూల్‌లో కొన్ని రోజులకే వేధింపులు ఎదురైనా, పని కోల్పోకూడదనే ఉద్దేశంతో భరించానని చెప్పారు. అయితే ఆ సమయంలో ఓ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ తనకు అండగా నిలిచారని స్వరా గుర్తుచేసుకున్నారు. దర్శకుడి ప్రవర్తన గురించి ఆయనకు చెప్పిన వెంటనే తనకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రక్షణ కల్పించారని తెలిపారు. ప్రస్తుతం ఆయనే తన మేనేజర్‌గా పనిచేస్తున్నారని వెల్లడించారు.



ట్రోలింగ్ బాధిస్తోంది

ఈవార్తలు, వినోదవాణి: సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు తనను ఏమాత్రం ప్రభావితం చేయవని చెప్పడం నిజం కాదని కోలీవుడ్ నటుడు ధనుష్ అన్నారు. నెగెటివ్ కామెంట్లు బాధ కలిగిస్తాయని, అయితే వాటి గురించి ఆలోచిస్తూ కూర్చోకుండా తన పనిపై దృష్టి పెడతానని చెప్పారు. 'ఓఎం' సినిమా ప్రమోషన్ల సందర్భంగా తన వ్యక్తిగత జీవితం, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై ఆయన మాట్లాడారు. 'తెరే ఇష్క్ మే' సినిమా ప్రమోషన్ల సమయంలో ధనుష్ ప్యాంట్‌ను ఆయన స్టైలిస్ట్ సరిచేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై కొందరు ఆయనను అహంకారి అంటూ ట్రోల్ చేశారు. ఈ ఘటనపై స్పందించిన ధనుష్.. తన స్టైలిస్ట్ పనిపై ఉన్న అంకితభావంతోనే అలా చేశారని చెప్పారు. "కాస్త నీ పని భారాన్ని తగ్గించుకోవచ్చుగా కావ్య" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా ట్రోలింగ్, ఫ్యాన్ వార్స్ తనను బాధిస్తాయా? అన్న ప్రశ్నకు ధనుష్ నిజాయితీగా సమాధానమిచ్చారు. "అవి నన్ను ప్రభావితం చేయవని చెబితే అబద్ధమే అవుతుంది. సోషల్ మీడియాలో వచ్చే నెగెటివిటీ కచ్చితంగా బాధిస్తుంది. అయితే వాటి గురించి ఎక్కువగా ఆలోచించకుండా నా పని మీద దృష్టి పెట్టడం నేర్చుకున్నాను" అని తెలిపారు. తన సినిమాలకు అసలైన విమర్శకులు ఇంట్లోనే ఉన్నారని చెబుతూ కుమారులు యాత్ర, లింగాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమా నచ్చకపోతే వారు ఇచ్చే రివ్యూలు చాలా కఠినంగా ఉంటాయని నవ్వుతూ చెప్పారు. అందుకే తన సినిమాల గురించి కుమారులను అడగాలంటేనే భయమేస్తుందని అన్నారు.

ఇఫీ-2026లో తెలుగు సినిమాలకు చోటేది?

ఈవార్తలు, వినోదవాణి: దేశంలోని వివిధ భాషల సినిమాలు ప్రతిష్ఠాత్మక భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ)-2026లో చోటు దక్కించుకుంటుండగా.. తెలుగు సినిమాల ప్రస్తావన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఏడాది పొడవునా వందల సినిమాలు నిర్మించే టాలీవుడ్ నుంచి ఈ వేడుకకు ఒక్క సినిమా కూడా ఎంపిక కాలేదా? లేక ఫిల్మ్ ఫెస్టివల్స్‌ను మన నిర్మాతలు పెద్దగా పట్టించుకోవడం లేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గోవాలో నవంబర్ 20 నుంచి 28 వరకు జరగనున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం షెడ్యూల్‌ను నిర్వాహకులు ప్రకటించారు. 'స్టోరీస్ వితౌట్ బోర్డర్స్' థీమ్‌తో నిర్వహించనున్న ఈ వేడుకలో 86 దేశాలకు చెందిన 150కి పైగా అంతర్జాతీయ చిత్రాలతో పాటు 18 భారతీయ భాషల సినిమాలు ప్రదర్శించనున్నారు. అయితే పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందుతున్న తెలుగు సినిమాలకు ఈసారి ప్రధాన విభాగాల్లో చోటు దక్కకపోవడం సినీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఈ వేదికలోని 'ఇండియన్ పనోరమా' ఫీచర్ ఫిల్మ్ విభాగాన్ని రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్'తో ప్రారంభించనున్నారు. మొత్తం 76 చిత్రాలు ప్రదర్శించనున్న ఈ విభాగంలో 'కాంతార: చాప్టర్ 1', 'హనుమాన్ అన్స్', 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్', 'కృష్ణావతారం పార్ట్ 1' వంటి చిత్రాలు చోటు దక్కించుకున్నాయి. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన 'రామాయణ: పార్ట్ 1' చిత్రం బ్రిక్స్ సినిమా విభాగాన్ని ప్రారంభించనుంది. 'ది కేరళ స్టోరీ 2' అంతర్జాతీయ పోటీ విభాగానికీ ఎంపికైంది. ఈసారి చలనచిత్రోత్సవానికి ప్రారంభ చిత్రంగా 'ఫాదర్‌ల్యాండ్', మిడ్‌ఫెస్ట్ చిత్రంగా 'ఐ మ్యాటర్', ముగింపు చిత్రంగా సింగపూర్‌కు చెందిన 'వి ఆర్ ఆల్ స్ట్రేంజర్స్' ఎంపికయ్యాయి. స్పెయిన్‌ను 'కంట్రీ ఆఫ్ హానర్'గా, రష్యాను 'పార్ట్‌నర్ కంట్రీ'గా ప్రకటించారు. యానిమేషన్, 'ఫిల్మ్ అబౌట్ ఫిల్మ్' పేరుతో రెండు కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టారు. దివంగత నటుడు నానా పటేకర్‌కు నివాళిగా 'నటసామ్రాట్' చిత్రాన్ని ఓపెన్ ఎయిర్ స్క్రీనింగ్‌లో ప్రదర్శించనున్నారు. ఇతర భాషల సినిమాలు ఇలాంటి అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు తెచ్చుకుంటుంటే తెలుగు సినిమాల ప్రాతినిధ్యం లేకపోవడం ఆలోచించాల్సిన అంశమే. బాక్సాఫీస్ వసూళ్లు, కమర్షియల్ హంగులకే ప్రాధాన్యం ఇస్తూ ఫిల్మ్ ఫెస్టివల్స్‌ను పట్టించుకోవడం లేదా? అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే కథలు, కళాత్మక విలువలున్న సినిమాల రూపకల్పనపై టాలీవుడ్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందా? అనే చర్చ మొదలైంది. కమర్షియల్ విజయాలతో పాటు ప్రపంచ సినిమా వేదికలపైనా తెలుగు సినిమా ఉనికిని చాటుకునే ప్రయత్నం జరగాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



బిజీగా శృతిహాసన్

ఈవార్తలు, వినోదవాణి: నటి, గాయని శృతిహాసన్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న ఆమె.. ఇప్పుడు కొత్త ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. నటిగానే కాకుండా గాయనిగానూ గుర్తింపు తెచ్చుకున్న శృతిహాసన్, తన తదుపరి సినిమాల వివరాలను తాజాగా వెల్లడించారు. 'అనగనగా ఒక ధీరుడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన శృతిహాసన్‌కు తొలి సినిమాలు ఆశించిన గుర్తింపు తీసుకురాలేదు. అయితే పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'గబ్బర్ సింగ్'తో ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించిన ఆమె.. ప్రభాస్ సరసన 'సలార్'లో కనిపించి పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' సినిమా నవంబర్ 20న విడుదల కానుంది. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి జంటగా నటిస్తున్నారు. శృతిహాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. స్వాసిక, రుహాని శర్మ, మురళీ శర్మ, గెటప్ శ్రీను, ప్రవీణ్ తదితరులు ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో శృతిహాసన్ చురుగ్గా పాల్గొంటున్నారు. మరోవైపు మైస్కిన్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ట్రైన్'లోనూ ఆమె నటించారు. ఈ చిత్రం డిసెంబర్ 4న విడుదల కానుంది. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'సలార్: పార్ట్ 2 – శౌర్యాంగపర్వం'లోనూ శృతిహాసన్ నటించనున్నారు. సోషల్ మీడియాలోనూ ఆమె చురుగ్గా ఉంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 23.5 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇలా నటిగా, గాయనిగా తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.



విక్కీ వార్నింగ్: కత్రినా

ఈవార్తలు, వినోదవాణి: నటి కత్రినా కైఫ్, నటుడు విక్కీ కౌశల్ దాంపత్య జీవితం సంతోషంగా సాగుతోంది. కుటుంబ బాధ్యతలతో పాటు సినిమాలు, వ్యాపారాన్ని కూడా కత్రినా సమన్వయం చేసుకుంటున్నారు. తన 'కే బ్యూటీ' బ్రాండ్‌ను మరింత విస్తరించే పనుల్లో బిజీగా ఉంటున్నారు. ఈ క్రమంలో పని విషయంలో తన భర్త విక్కీ ఇచ్చే సలహాలు, మద్దతు గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. వ్యాపారాన్ని ఇష్టపడి చేస్తున్నప్పుడు పని గంటలను లెక్కపెట్టాల్సిన అవసరం ఉండదని కత్రినా చెప్పారు. అయితే తాను పని ఒత్తిడిలో విశ్రాంతిని పట్టించుకోకుండా ఉంటే విక్కీ వెంటనే గుర్తుచేస్తారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి పడుకున్న తర్వాత కూడా ఫోన్ చూస్తూ ఉంటే ఆయనకు నచ్చదన్నారు. "ఇక ఫోన్ పక్కన పెట్టేయ్.. విశ్రాంతి తీసుకో" అంటూ హెచ్చరిస్తారని చెప్పారు.

ఇంకా జీవితాన్ని అర్థం చేసుకుంటున్నా

ఈవార్తలు, వినోదవాణి: బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రియాంక చోప్రా చిన్ననాటి జ్ఞాపకాలను అభిమానులతో పంచుకున్నారు. తొమ్మిదేళ్ల వయసులో దిగిన ఫొటోతో పాటు 17 ఏళ్ల వయసులో మిస్ ఇండియా కిరీటం గెలుచుకున్నప్పటి ఫొటోను ఒకే ఫ్రేమ్‌లో ఉంచి సోషల్ మీడియాలో షేర్ చేశారు. 25 ఏళ్లు గడిచినా ఇప్పటికీ జీవితాన్ని అర్థం చేసుకుంటూనే ఉన్నానని పేర్కొన్నారు.





విడిపోయి ఒక్కటయ్యాం

ఈవార్తలు, వినోదవాణి: టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ తన ప్రేమకథ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. భర్త గౌతమ్ కిచ్లూను పెళ్లి చేసుకోవడానికి ముందు తమ మధ్య చోటుచేసుకున్న పరిణామాలను ఓ సందర్భంలో పంచుకున్నారు. దాదాపు 13, 14 ఏళ్ల క్రితమే ఇద్దరి మధ్య ప్రేమ మొదలైందని, ఆ తర్వాత విడిపోయి ఇతర వ్యక్తులతో డేటింగ్ చేశామని తెలిపారు. "మేము 13 లేదా 14 ఏళ్ల క్రితమే ప్రేమలో ఉన్నాం. కానీ కొన్ని కారణాల వల్ల విడిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఇద్దరం మా జీవితాల్లో ముందుకు వెళ్లిపోయాం. ఇతర వ్యక్తులతో డేటింగ్ చేశాం. ఆ అనుభవాల ద్వారా మాకు నిజంగా ఏం కావాలో అర్థమైంది" అని కాజల్ చెప్పారు. కరోనా సమయంలో తామిద్దరం మళ్లీ దగ్గరయ్యామని ఆమె తెలిపారు. ఈసారి మళ్లీ విడిపోవడం ఇష్టం లేకపోవడంతో గౌతమ్‌తో స్పష్టంగా మాట్లాడానన్నారు.



యుద్ధం అంటే మైదానంలోనే: శ్రేయస్ అయ్యర్

ఈవార్తలు, క్రీడావాణి: న్యూజిలాండ్ పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లు గెలవడం గొప్ప విజయమని టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. మారుతున్న వాతావరణం, భిన్నమైన పిచ్ పరిస్థితుల మధ్య రెండు సిరీస్‌ల్లోనూ విజయం సాధించడం సంతృప్తినిచ్చిందని తెలిపాడు. చివరి వన్డేలో గెలిచి భారత్ 3-1తో సిరీస్ కైవసం చేసుకున్న అనంతరం అతడు మాట్లాడాడు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో ఆశించినంతగా పరుగులు చేయలేకపోయినా, ఏ దశలోనైనా మ్యాచ్‌ను మనవైపు తిప్పుకోగలమనే నమ్మకం జట్టులో ఉందని శ్రేయస్ చెప్పాడు. ఆటగాళ్లంతా సానుకూల దృక్పథంతో ఆడి, ప్రణాళికలను అమలు చేశారని వివరించాడు. ఈ సిరీస్‌లో బ్యాటర్ల కంటే బౌలర్లదే కీలక పాత్ర అని, భారత బౌలర్లు ఒత్తిడిని తట్టుకుని పరిస్థితులకు తగ్గట్టుగా బౌలింగ్ చేశారని ప్రశంసించాడు. టెస్టు మ్యాచ్‌ల సన్నాహకాలు, ఆటగాళ్ల గాయాల కారణంగా తుది జట్టులో తరచూ మార్పులు చేయాల్సి వచ్చిందని శ్రేయస్ గుర్తుచేశాడు. మార్పులకు అలవాటు పడటం కొంత కష్టమైనా, తాము ఎలాంటి సాకులు చెప్పలేదని స్పష్టం చేశాడు. జట్టులోకి వచ్చిన ప్రతి ఒక్కరూ తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో ఆడారని పేర్కొన్నాడు. సిరీస్ కోసం స్టేడియాలకు వచ్చిన భారత, న్యూజిలాండ్ అభిమానులకు ధన్యవాదాలు తెలిపాడు. ఫలితాలతో సంబంధం లేకుండా ఇరు జట్లను సమానంగా ప్రోత్సహించడం క్రీడాస్ఫూర్తికి నిదర్శనమన్నాడు. మైదానంలో ఇరు జట్ల మధ్య పోటీ యుద్ధంలా ఉంటుందని, బయట మాత్రం ఆటగాళ్లంతా స్నేహంగా ఉంటారని చెప్పాడు. క్రీడల్లో ఇలాంటి వాతావరణమే ఉండాలని అభిప్రాయపడ్డాడు.

మటన్ కర్రీ, రోటీలతో సూర్య దావత్!

ఈవార్తలు, క్రీడావాణి: మైదానంలో సిక్సర్లతో విరుచుకుపడిన టీమిండియా స్టార్ సూర్యకుమార్ యాదవ్.. మ్యాచ్ తర్వాత స్నేహితుడి ఇంట్లో సాధారణంగా భోజనం చేస్తూ కనిపించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్‌పై ముంబై విజయం సాధించిన అనంతరం సహచర ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్‌తో కలిసి మటన్ కర్రీ, రోటీలు తింటున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మైదానంలో భారీ షాట్లతో అలరించే స్టార్ ఆటగాళ్లు.. గదిలో నేలపై కూర్చొని భోజనం చేయడం అభిమానులను ఆకట్టుకుంది. భోజనం చాలా బాగుందని, మాట్లాడటం కంటే తినడానికే మనసవుతోందని సర్ఫరాజ్ సరదాగా చెప్పిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. అంతకుముందు హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ బ్యాట్‌తో చెలరేగాడు. 172 పరుగుల లక్ష్య ఛేదనలో 21 బంతుల్లో ఐదు సిక్సర్లు, ఆరు ఫోర్లతో అజేయంగా 60 పరుగులు చేశాడు. 15 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అతడి ధాటికి ముంబై 13.1 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టు ఎంపికలో చోటు దక్కకపోవడం తనను బాధించిందని సూర్య ఈ సందర్భంగా పేర్కొన్నాడు. మళ్లీ టీమిండియాలో ఆడాలంటే తన ఆటతీరుతో మరోసారి నిరూపించుకోవాల్సిందేనని చెప్పాడు. దేశవాళీ క్రికెట్‌లోనూ తనకు ఆటపై ఆకలి, పట్టుదల తగ్గలేదని ఈ ఇన్నింగ్స్‌తో చాటాడు.







భారత్‌దే సిరీస్

కివీస్ గడ్డపై ఏడేళ్ల రికార్డుకు బ్రేక్

ఈవార్తలు, క్రీడావాణి: న్యూజిలాండ్‌తో జరిగిన చివరి వన్డేలో భారత్ 22 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంది. మౌంట్ మాంగనూయిలోని బే ఓవల్ వేదికగా జరిగిన తక్కువ స్కోర్ల ఉత్కంఠ పోరులో భారత జట్టు సమష్టిగా రాణించింది. ఈ ఓటమితో సొంతగడ్డపై న్యూజిలాండ్ వరుసగా 11 ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లు గెలిచిన రికార్డుకు బ్రేక్ పడింది.

2019 తర్వాత కివీస్ జట్టు స్వదేశంలో వన్డే సిరీస్ కోల్పోవడం ఇదే తొలిసారి. అప్పుడూ భారత్ చేతిలోనే ఓడింది. భారత హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గౌతమ్ గంభీర్‌కు విదేశాల్లో ఇదే తొలి వన్డే సిరీస్ విజయం. 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 187 పరుగులకే ఆలౌటైంది. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకున్న తాత్కాలిక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పేసర్లకు ఎక్కువ ఓవర్లు ఇచ్చాడు. 36వ ఓవర్ వరకు స్పిన్నర్లను బరిలోకి దించకుండా పేస్ బౌలింగ్‌తోనే కివీస్‌ను కట్టడి చేశాడు. అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు తీయగా, మహమ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అరంగేట్రం చేసిన యశ్ ఠాకూర్, ఆకిబ్ నబీ తలో వికెట్ తీశారు. కీలక సమయంలో నమన్ ధీర్.. కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (24)ను ఔట్ చేసి భారత్‌కు పైచేయి అందించాడు. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. రోహిత్ శర్మ (7), విరాట్ కోహ్లీ (5) నిరాశపరిచారు. అక్షర్ పటేల్ (46), ఇషాన్ కిషన్ (46) జట్టును ఆదుకున్నారు. చివర్లో మహమ్మద్ సిరాజ్ (14 నాటౌట్), అర్ష్‌దీప్ సింగ్ (14) చివరి వికెట్‌కు 28 పరుగులు జోడించి జట్టు స్కోరును 200 దాటించారు. అనంతరం బౌలర్లు సమష్టిగా రాణించడంతో భారత్ సిరీస్‌ను సొంతం చేసుకుంది.



మరో ధోనీలా లక్ష్య రాయ్‌చందానీ!

ఈవార్తలు, క్రీడావాణి: భారత అండర్-19 జట్టు కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీపై ఉత్తరాఖండ్ సీనియర్ పురుషుల జట్టు హెడ్ కోచ్ మనీష్ ఝా ప్రశంసలు కురిపించాడు. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండటం, మ్యాచ్ పరిస్థితులను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకోవడంలో లక్ష్య ప్రత్యేకమని చెప్పాడు. అతడి నాయకత్వ శైలిలో టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ లక్షణాలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడ్డాడు. స్టార్ స్పోర్ట్స్ వీడియోలో మాట్లాడిన మనీష్ ఝా.. "కొంతమంది ఆటగాళ్లు మైదానంలో దూకుడుగా కనిపిస్తారు. మరికొందరు పెద్దగా హడావుడి చేయకుండా తమ పని తాము చేసుకుపోతారు. లక్ష్య గేమ్ సెన్స్ అద్భుతం. మ్యాచ్‌ను అర్థం చేసుకునే తీరు చాలా బాగుంటుంది. సెంచరీ చేసినా ఎక్కువగా సంబరాలు చేసుకోడు. డకౌట్ అయినా కంగారుపడడు. ఎప్పుడూ ఒకేలా ప్రశాంతంగా ఉంటాడు. ధోనీ కూడా మైదానంలో భావోద్వేగాలను పెద్దగా ప్రదర్శించేవారు కాదు. లక్ష్యలోనూ అదే ప్రశాంతత, స్పష్టత కనిపిస్తున్నాయి" అని వివరించాడు. ఉత్తరాఖండ్ సీనియర్ జట్టుతో ఉన్నప్పుడూ లక్ష్య వ్యవహారశైలి పరిణతితో ఉంటుందని ఝా చెప్పాడు. మైదానంలో అతిగా అరవడం, హడావుడి చేయడం వంటివి ఉండవని, అయితే కోచ్‌లతో మాత్రం ఆట గురించి స్పష్టంగా చర్చిస్తాడని తెలిపాడు. చేతలతోనే తన ప్రతిభను చూపిస్తాడని కొనియాడాడు. లక్ష్య ప్రదర్శనలు కూడా కోచ్ ప్రశంసలకు తగ్గట్టుగానే ఉన్నాయి. 2025-26 రంజీ ట్రోఫీలో ఉత్తరాఖండ్ తరపున ఐదు ఇన్నింగ్స్‌ల్లో 223 పరుగులు చేశాడు. నాకౌట్ మ్యాచ్‌ల్లో బెంగాల్‌పై 86, కర్ణాటకపై 55 పరుగులు సాధించాడు. 2026 జులైలో శ్రీలంక పర్యటనతో యూత్ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన అతడు.. గాలేలో జరిగిన తొలి యూత్ టెస్టులో సాగర్ విర్క్‌తో కలిసి తొలి వికెట్‌కు 295 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ మ్యాచ్‌లో 324 బంతుల్లో 207 పరుగులు చేశాడు. కొలంబోలో జరిగిన రెండో టెస్టులోనూ 116 బంతుల్లో 100 పరుగులు సాధించాడు. సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన సిరీస్‌లో మూడో యూత్ వన్డేలో 110 పరుగులు చేశాడు. తొలి యూత్ టెస్టులో 281 బంతుల్లో 240 పరుగులతో కెరీర్ బెస్ట్ స్కోరు నమోదు చేసి, భారత్ ఇన్నింగ్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. యూత్ వన్డే కెప్టెన్‌గా, యూత్ టెస్ట్ వైస్ కెప్టెన్‌గా రాణించిన లక్ష్య.. తాజాగా భారత జట్టును అండర్-19 ఆసియా కప్ విజేతగా నిలిపాడు.



పాక్ అభిమానుల నోట 'సెహ్వాగ్' నినాదాలు

ఈవార్తలు, క్రీడావాణి: అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై భారత యువ జట్టు ఒక్క వికెట్ తేడాతో గెలిచిన తర్వాత.. మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్, అతడి కుమారుడు ఆర్యవీర్ మధ్య జరిగిన వీడియో కాల్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ వీడియోను సెహ్వాగ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు. ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ భారీ స్కోరు చేయగా.. 338 పరుగుల లక్ష్యాన్ని భారత్ చివరి బంతికి ఛేదించింది. 339/9 స్కోరుతో విజయం సాధించింది. ఆఖరి బంతికి మూడు పరుగులు అవసరమైన సమయంలో మోహిత్ ఉల్వా ఫోర్ కొట్టి జట్టుకు టైటిల్ అందించాడు. ఈ టోర్నీలో నిలకడగా రాణించిన ఆర్యవీర్ సెహ్వాగ్ 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు అందుకున్నాడు. టోర్నీ మొత్తంలో ఒక సెంచరీ, మూడు అర్ధసెంచరీలతో 160 పరుగులు చేశాడు. ఫైనల్‌లోనూ 61 బంతుల్లో 58 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ తర్వాత తండ్రితో మాట్లాడిన ఆర్యవీర్.. చివరి ఓవర్లలో మ్యాచ్ ఉత్కంఠగా సాగుతున్నప్పుడు డగౌట్‌లో కూర్చొని తాను 'సీతా రామ్.. సీతా రామ్' అంటూ జపం చేశానని సరదాగా చెప్పాడు. బ్యాటింగ్ సమయంలో మోచేతికి గాయమైందని, ఫిజియో రెండుసార్లు పరీక్షించారని



వివరించాడు. స్టేడియంలో ఉన్న సుమారు రెండు వేల మంది పాకిస్థాన్ అభిమానులు 'సెహ్వాగ్.. సెహ్వాగ్' అంటూ నినాదాలు చేసి తనను ఉత్సాహపరిచారని తెలిపాడు. వారి నుంచి అలాంటి మద్దతు రావడం ఆశ్చర్యంగా, ఆనందంగా అనిపించిందన్నాడు. ఢిల్లీకి వెళ్లాక మోచేతికి ఎంఆర్ఐ స్కాన్ చేయించుకోనున్నట్లు చెప్పాడు. కుమారుడి ప్రదర్శనపై సెహ్వాగ్ భావోద్వేగానికి లోనయ్యాడు. ఇలాంటి ప్రత్యేక క్షణాలు అవార్డులు, పరుగులు, ట్రోఫీల కంటే గొప్పవని పేర్కొన్నాడు. ఈ జ్ఞాపకాలను తండ్రిగా జీవితాంతం గుర్తుంచుకుంటానని చెబుతూ.. కష్టపడాలని, ప్రతిభను నమ్ముకోవాలని, ఎప్పుడూ వినయంగా ఉండాలని కుమారుడికి సూచించాడు.

వాట్ ఏ మ్యాచ్!

ఆర్యవీర్‌పై వైభవ్ ప్రశంసలు

ఈవార్తలు, క్రీడావాణి: అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన ఉత్కంఠభరిత విజయంపై యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ స్పందించాడు. 'వాట్ ఏ మ్యాచ్' అంటూ తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు. టోర్నీలో అదరగొట్టిన వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్‌ను 'స్టార్ బాయ్' అంటూ ప్రత్యేకంగా అభినందించాడు. చివరి బంతి వరకు సాగిన ఫైనల్‌లో భారత్ ఒక్క వికెట్ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్ గెలుచుకుంది. గ్రూప్ దశలో పాక్ చేతిలో ఓటమి పాలైన భారత జట్టు.. ఫైనల్‌లో గెలిచి ప్రతీకారం తీర్చుకుంది. మ్యాచ్ ఎక్కువసేపు పాకిస్థాన్ ఆధిపత్యంలో సాగినా, చివర్లో భారత ఆటగాళ్లు పుంజుకుని విజయాన్ని అందుకున్నారు. ఈ విజయంపై వైభవ్ స్పందిస్తూ.. "కంగ్రాచ్యులేషన్స్.. ఓ మ్యాన్.. వాట్ ఏ మ్యాచ్!" అని పోస్ట్ చేశాడు. మరో ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఆర్యవీర్‌ను 'స్టార్ బాయ్' అంటూ కొనియాడాడు. ఈ టోర్నీలో 361 పరుగులు చేసిన ఆర్యవీర్ 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాడు.

ఈవార్తలు
ప్రజావాణి
సోమవారం 16-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

ఓటు హక్కు.. జాబితా గడప దాటాలి!

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం ఒక గుర్తింపు కార్డు మీద ఉండే సంఖ్య కాదు. ప్రభుత్వాలను ఎన్నుకునే పౌరుడి అధికారం. తన పాలకుడిని ప్రశ్నించే ప్రజాస్వామ్య బలం. ఆ హక్కు వినియోగించుకోవాలంటే ఓటర్ల జాబితాలో పేరు ఉండాలి. అందుకే ఎన్నికల ముందు ఓటర్ల జాబితా సవరణ అత్యంత కీలకమైన ప్రక్రియ. మరణించిన వారి పేర్లు తొలగించడం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లను సరిచేయడం, చిరునామాలు మారినవారి వివరాలను నవీకరించడం అవసరమే. కానీ ఈ క్రమంలో అర్హులైన ఓటర్ల పేర్లు కూడా తొలగిపోతే అది పరిపాలనా పొరపాటుగా మాత్రమే మిగలదు. ప్రజాస్వామ్య హక్కుపై నేరుగా ప్రభావం చూపుతుంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) విషయంలో ఇలాంటి ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం తాజాగా సుప్రీంకోర్టుకు ఇచ్చిన వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అవసరాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. ఓటర్ల జాబితాలో నకిలీ పేర్లు, ఒకే వ్యక్తి పలు చోట్ల నమోదు, మరణించిన వారి వివరాలు కొనసాగడం వంటి సమస్యలు ఎన్నికల విశ్వసనీయతను దెబ్బతీస్తాయి. వాటిని తొలగించడం ఎన్నికల సంఘం బాధ్యత. కానీ సవరణ ప్రక్రియలో ఒక వ్యక్తి పేరు ఎందుకు తొలగించబడింది? ఏ ఆధారం ఆధారంగా తొలగించారు? అతను ఎక్కడికి వెళ్లి తన వాదన వినిపించాలి? ఎన్ని రోజుల్లో పరిష్కారం లభిస్తుంది? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. తప్పు జరిగిందని నిరూపించుకునే బాధ్యత మొత్తం పౌరుడిపైనే పడకూడదు. ఎన్నికల యంత్రాంగం కూడా తన వద్ద ఉన్న సమాచారాన్ని సరిచూసి, అవసరమైతే క్షేత్రస్థాయిలో ధ్రువీకరించాలి. ముఖ్యంగా వలస కార్మికులు, నిరాశ్రయులు, వృద్ధులు, దివ్యాంగులు, అక్షరాస్యత తక్కువగా ఉన్నవారు ఈ ప్రక్రియలో ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పని కోసం వెళ్లిన వ్యక్తి తన పాత చిరునామాకు తిరిగి వెళ్లి పత్రాలు సమర్పించడం కష్టమవుతుంది. ఆధార్, ఇతర గుర్తింపు పత్రాల్లో చిరునామా మార్పులు లేకపోవచ్చు. డిజిటల్ దరఖాస్తులు చేయడానికి సాంకేతిక పరిజ్ఞానం లేకపోవచ్చు. ఇలాంటి వారిని జాబితా నుంచి తొలగించి, మళ్లీ దరఖాస్తు చేసుకోమని చెప్పడం మాత్రమే సరిపోదు. వారి వద్దకు వెళ్లి వివరాలు సేకరించే వ్యవస్థ ఉండాలి. నిరాశ్రయుల విషయంలో బూత్ స్థాయి అధికారుల క్షేత్రస్థాయి ధృవీకరణను ఉపయోగించే మార్గాలూ అందుబాటులో ఉండాలి. ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది. గతంలో ముసాయిదా జాబితా నుంచి తొలగించిన ఓటర్లను ఏఎస్‌డీఈ వర్గాలుగా గుర్తించే విధానం, ఫారం-6 ద్వారా తిరిగి చేర్చే ప్రక్రియపై న్యాయస్థానం ప్రశ్నలు లేవనెత్తింది. ఎన్నికల సంఘం తాజాగా ఇచ్చిన వివరణతో కొన్ని ఆందోళనలు తగ్గవచ్చు. కానీ తొలగింపునకు గురైన ప్రతి అర్హుడి పేరు తుది జాబితాలో చేరిందా? కొత్త విధానం వల్ల ఎవరైనా మళ్లీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? అన్నది ఇంకా పరిశీలించాల్సి ఉంది. ఈ అంశంపై తదుపరి విచారణ నవంబర్ 19న జరగనుంది. కాబట్టి ఎన్నికల సంఘం ఇచ్చిన అఫిడవిట్‌ను సుప్రీంకోర్టు తుది తీర్పుగా భావించకూడదు.



విజిల్ బ్లోయర్లకు రక్షణేది?

ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి జరుగుతోందని తెలిసిన ఉద్యోగి దాన్ని బయటపెట్టాలనుకుంటే అతనికి ముందుగా గుర్తుకొచ్చేది న్యాయం కాదు.. తన ఉద్యోగం. అక్రమాలను ప్రశ్నిస్తే బదిలీ చేస్తారేమో, పదోన్నతి నిలిపేస్తారేమో, తప్పుడు విచారణలు ఎదుర్కోవాల్సి వస్తుందేమో, కుటుంబం ఇబ్బందుల్లో పడుతుందేమో అన్న భయం వెంటాడుతుంది. ప్రభుత్వ ఉద్యోగి కాకపోయినా, ఒక ప్రైవేటు వ్యక్తి ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని ఆధారాలతో బయటపెడితే అతనికీ ఇలాంటి ప్రమాదాలే ఎదురుకావచ్చు. అవినీతి బయటపడాలని పాలకులు కోరుకుంటారు. కానీ దాన్ని బయటపెట్టే వ్యక్తికి రక్షణ కల్పించడంలో వ్యవస్థ వెనుకబడితే నిజాయితీగా మాట్లాడే గొంతులు మౌనంగా మారిపోతాయి. ఈ సమస్యను మరోసారి జాతీయ చర్చకు తీసుకొచ్చింది విజిల్‌బ్లోయర్ రక్షణ చట్టం అమలులోకి రాకపోవడంపై భారత అటవీ సేవల అధికారి సంజీవ్ చతుర్వేది సుప్రీంకోర్టును ఆశ్రయించడం. మాగ్ససే అవార్డు గ్రహీత, ఐఎఫ్ఎస్ అధికారి సంజీవ్ చతుర్వేది నవంబర్ 15న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అవినీతిని బయటపెట్టే ప్రభుత్వ ఉద్యోగులు, పౌరులకు రక్షణ కల్పించే సమగ్ర వ్యవస్థ లేదని, 2014లో పార్లమెంటు ఆమోదించిన విజిల్‌బ్లోయర్స్ ప్రొటెక్షన్ చట్టం ఇప్పటికీ అమల్లోకి రాలేదని ఆయన వాదించారు. తనకు ఎదురైన బదిలీలు, సర్వీసు వివాదాలను ప్రస్తావిస్తూ, అక్రమాలను బయటపెట్టినవారిపై ప్రతీకార చర్యలు తీసుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తాత్కాలిక మార్గదర్శకాలు రూపొందించి, చట్టం అమలులోకి వచ్చే వరకు రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఇవి పిటిషనర్ చేసిన వాదనలు మాత్రమే; వాటిపై న్యాయస్థానం ఇంకా తుది నిర్ణయం వెలువరించలేదు. అయినప్పటికీ ఆయన లేవనెత్తిన సమస్య దేశవ్యాప్తంగా ప్రజా ప్రయోజనానికి సంబంధించినది.

విజిల్‌బ్లోయర్స్ ప్రొటెక్షన్ బిల్లు 2011లో లోక్‌సభలో చర్చకు వచ్చి ఆమోదం పొందింది. 2014 ఫిబ్రవరిలో రాజ్యసభ ఆమోదం తెలిపింది. అదే ఏడాది మే 9న రాష్ట్రపతి ఆమోదం లభించగా, మే 12న భారత గెజిట్‌లో చట్టం ప్రచురితమైంది. అయితే చట్టంలోని సెక్షన్ 1(3) ప్రకారం, కేంద్ర ప్రభుత్వం అధికారిక గెజిట్‌లో ప్రత్యేక ప్రకటన జారీ చేసిన తేదీ నుంచే నిబంధనలు అమల్లోకి రావాలి. అలాంటి ప్రకటన ఇప్పటివరకు వెలువడలేదు. 2015లో కేంద్రం ఈ చట్టానికి సవరణలు చేయడానికి బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది. కానీ అది రాజ్యసభలో ఆమోదం పొందకుండానే 16వ లోక్‌సభ రద్దుతో కాలం చెల్లింది. సార్వభౌమాధికారం, దేశ భద్రతకు సంబంధించిన రహస్య సమాచారం బయటపడకుండా చట్టంలో మార్పులు అవసరమని ప్రభుత్వం కారణం చెబుతోంది. 2025 డిసెంబర్ 11న పార్లమెంటరీ ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలోనూ చట్టాన్ని అమల్లోకి తీసుకురావడానికి నోటిఫికేషన్ జారీ కాలేదని కేంద్రం స్పష్టం చేసింది. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారం, రక్షణ వ్యవస్థల వివరాలు, గోప్యమైన వ్యూహాలు బహిర్గతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఈ విషయంలో చట్టంలో తగిన పరిమితులు ఉండటం అవసరమే. కానీ ఆ కారణంతో అవినీతి, అధికార దుర్వినియోగం, ప్రజాధనం దోపిడీ వంటి అంశాలను బయటపెట్టే వ్యక్తులకు రక్షణ కల్పించే చట్టాన్నే నిరవధికంగా నిలిపివేయడం సరైన విధానం కాదు. దేశ భద్రతకు హాని కలిగించే సమాచారం, ప్రజా ప్రయోజనానికి సంబంధించిన అవినీతి సమాచారం రెండింటినీ ఒకే గాటన కట్టకూడదు. ఏ సమాచారం రక్షిత పరిధిలోకి వస్తుంది? ఏది ప్రజా ప్రయోజన వెల్లడికి అర్హం? అన్నది స్వతంత్ర సంస్థ పరిశీలించే విధానం ఉండాలి. అనవసరంగా రహస్య సమాచారం బయటపెట్టే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉండాలి. అదే సమయంలో ప్రజాధనం దుర్వినియోగాన్ని నిజాయితీగా బయటపెట్టిన వ్యక్తిని శిక్షించే పరిస్థితి రాకూడదు.

ప్రస్తుతం కేంద్ర విజిలెన్స్ కమిషన్ 2004 నాటి ప్రజా ప్రయోజన ప్రకటనలు, సమాచారదారుల రక్షణ తీర్మానం కింద కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోని సంస్థలకు సంబంధించిన అవినీతి ఫిర్యాదులను స్వీకరించే అధికార సంస్థగా పనిచేస్తోంది. అంటే అసలు వ్యవస్థ ఏదీ లేదని చెప్పడం సరికాదు. అయితే ఇది 2014 చట్టానికి ప్రత్యామ్నాయం కాదు. దీని పరిధి ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర నియంత్రణలోని సంస్థలకే పరిమితం. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఉద్యోగులు, ఇతర రంగాల్లో ప్రజా ప్రయోజన విషయాలు బయటపెట్టే వ్యక్తులకు సమగ్ర రక్షణ కల్పించే విస్తృత చట్టపరమైన వ్యవస్థ అవసరం. 2025 డిసెంబర్‌లో పార్లమెంటుకు సమర్పించిన గణాంకాల ప్రకారం, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు పీఐడీపీఐ విధానంలో వచ్చిన ఫిర్యాదులు 2020లో 555 ఉండగా, 2024లో 2,630కు చేరాయి. ఫిర్యాదుల పెరుగుదలతో పాటు వాటి విచారణ, పరిష్కారం, ఫిర్యాదుదారుల భద్రతపై కూడా దృష్టి పెట్టాలి. విజిల్‌బ్లోయర్ రక్షణ చట్టం సమర్థంగా పనిచేయాలంటే కేవలం ఫిర్యాదు స్వీకరించే అధికారి ఉండటం సరిపోదు. ఫిర్యాదుదారుడి గుర్తింపును గోప్యంగా ఉంచాలి. ఫిర్యాదు చేసినందుకు బదిలీ, పదోన్నతి నిరాకరణ, వేతన కోత, క్రమశిక్షణ చర్యలు, వేధింపులు ఎదురైతే వెంటనే జోక్యం చేసుకునే అధికార సంస్థ ఉండాలి. అవసరమైనప్పుడు పోలీసు రక్షణ, న్యాయ సహాయం, కుటుంబ భద్రత కల్పించాలి. తప్పుడు ఆరోపణలు, వ్యక్తిగత కక్షతో చేసే ఫిర్యాదులను వడపోసే విధానం కూడా ఉండాలి. అయితే తప్పుడు ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామన్న పేరుతో నిజమైన ఫిర్యాదుదారులను భయపెట్టే పరిస్థితి రాకూడదు. ఫిర్యాదుపై విచారణకు నిర్దిష్ట గడువు, ఫలితాన్ని తెలియజేసే బాధ్యత, ప్రతీకార చర్యలపై స్వతంత్ర దర్యాప్తు ఉండాలి.

- పవన్ కుమార్ సిద్ధం, నల్లగొండ

రైతుకు సాయం ఎప్పుడు?

వాన కోసం ఎదురుచూసిన రైతుకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. విత్తనాలు వేసిన చోట మొలకలు సరిగా రాలేదు. మొలిచిన పంటకు అవసరమైన సమయంలో నీరు అందలేదు. సాగు విస్తీర్ణం తగ్గింది. పంట చేతికి వస్తుందన్న నమ్మకం సన్నగిల్లింది. వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ కుటుంబాలకు ఆదాయం తగ్గితే దాని ప్రభావం రైతుతోనే ఆగిపోదు. కూలీలకు పని తగ్గుతుంది. పశువులకు మేత సమస్య వస్తుంది. గ్రామీణ మార్కెట్లలో కొనుగోలు శక్తి పడిపోతుంది. అప్పుల చెల్లింపులు వాయిదా పడతాయి.

ఇలాంటి పరిస్థితుల్లో కరువు బాధిత రైతులకు తక్షణ ఉపశమనం కల్పించడం ప్రభుత్వాల ప్రథమ బాధ్యత. తెలంగాణలో 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర సాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే భేటీ జరగడం ఒక ముందడుగే అయినా, రైతుల చేతికి సాయం అందే వరకు ఈ ప్రక్రియ పూర్తయినట్లు కాదు. నవంబర్ 15న ఢిల్లీలో రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రధానమంత్రి మోదీని కలిశారు. ప్రధానమంత్రి కార్యాలయం కూడా ఈ భేటీని అధికారికంగా ధృవీకరించింది. రాష్ట్రంలో వర్షాభావం, కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు రాష్ట్రానికి సంబంధించిన వార్తా కథనాలు వెల్లడించాయి. తెలంగాణకు ప్రత్యేక ఆర్థిక సాయం కోరినట్లు కూడా నివేదికలు పేర్కొన్నాయి. అయితే ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసిన సంక్షిప్త ప్రకటనలో కరువు సాయం ఎంత మంజూరైందన్న వివరాలు లేవు. కేంద్రం నుంచి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు కూడా అధికారికంగా వెల్లడించలేదు. అందువల్ల ఈ భేటీని సాయం మంజూరైనట్లుగా భావించడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 27న జారీ చేసిన కరువు ప్రకటన ప్రకారం 33 జిల్లాల్లో 31 జిల్లాలకు చెందిన 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించింది. వీటిలో 111 మండలాలు తీవ్ర కరువు, 254 మండలాలు మధ్యస్థ కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు వర్గీకరించింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 615.5 మిల్లీమీటర్లే కురిసింది. అంటే 17 శాతం లోటు. 18 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గింది. వరి సాగు విస్తీర్ణమే 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పడిపోయింది. ప్రధాన, మధ్యతరహా ప్రాజెక్టుల్లో కలిపి



585 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గాను 179.63 టీఎంసీల నీరే అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు సూచించాయి. ఇవి కేవలం వర్షపాతం సంఖ్యలు కావు. రానున్న సాగు, తాగునీటి అవసరాలపై ప్రభావం చూపే పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర శాసనసభ సెప్టెంబర్ 18న ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోరింది. జాతీయ విపత్తు స్పందన నిధి నుంచి సాయం, పంట నష్టానికి పరిహారం, పెట్టుబడి రాయితీలు, తాగునీరు, పశుగ్రాసం, భూగర్భ జలాలు, చెరువుల పునరుద్ధరణకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గ్రామీణ ఉపాధి పథకం కింద అదనంగా 50 రోజుల పని కల్పించాలని, రుణాల విషయంలో వెసులుబాటు కల్పించాలని కూడా కోరింది. కరువు ప్రకటన వెలువడిన తర్వాత జిల్లా కలెక్టర్లు బాధిత రైతుల వివరాలు, ఖర్చుల రికార్డులు నిర్వహించాలని, వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణకు బ్యాంకులతో మాట్లాడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇన్‌పుట్ సబ్సిడీని కేంద్రం నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ నిధులు అందిన నెలలోపు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ఇక్కడే ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతోంది. కేంద్రం నుంచి నిధులు వచ్చిన తర్వాతే పెట్టుబడి రాయితీ చెల్లించే విధానం ఉంటే, అప్పటి వరకు రైతు ఎలా బతకాలి? విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు ఇప్పటికే పెట్టిన రైతుకు తక్షణ ఆర్థిక అవసరం ఉంటుంది. రుణ వాయిదాలు, కుటుంబ ఖర్చులు, పశువుల నిర్వహణ భారమూ తప్పవు. కేంద్ర సాయం కోసం ఎదురుచూస్తూనే రాష్ట్ర ప్రభుత్వం తన వనరులతో ముందస్తు ఉపశమన చర్యలు చేపట్టాలి. అర్హులైన రైతుల జాబితాలను వేగంగా పూర్తి చేసి, తాత్కాలిక సాయం అందించాలి. కేంద్రం నుంచి నిధులు వచ్చిన తర్వాత వాటిని తదుపరి దశలో సర్దుబాటు చేసుకోవచ్చు. విపత్తు సమయంలో రైతును కేంద్రం, రాష్ట్రం మధ్య తిరిగేలా చేయకూడదు. కరువు ప్రభావం ఉన్న ప్రతి మండలంలో పంటల నష్టం ఒకేలా ఉండదు. కొన్ని ప్రాంతాల్లో వర్షం తక్కువగా కురిసినా బోర్లు, చెరువుల ఆధారంగా పంటలు నిలబడవచ్చు. మరికొన్ని ప్రాంతాల్లో వర్షాభావంతో పాటు భూగర్భ జలాలు పడిపోవడంతో సాగు పూర్తిగా దెబ్బతినవచ్చు. అందువల్ల మండలాల ప్రకటనతో సరిపెట్టకుండా గ్రామం, రైతు, పంట ఆధారంగా నష్టాన్ని అంచనా వేయాలి. పంటల బీమా, పెట్టుబడి రాయితీ, రుణాల పునర్వ్యవస్థీకరణ మధ్య సమన్వయం ఉండాలి. పంట నష్టపోయిన రైతు అప్పు వసూలు ఒత్తిడికి గురికాకుండా బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. కౌలు రైతులను కూడా గుర్తించి సహాయ పరిధిలోకి తీసుకురావాలి. భూమి యజమానికే కాకుండా సాగు చేసి నష్టపోయిన వ్యక్తికీ ఉపశమనం అందాలి.

- వీరన్న, పెద్దపల్లి

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.